J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12
THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 25 26.11.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



### • రాష్ట్ర రాజకీయాలలో మలుపు

# బాబు ఏడుపు.. పార్టీకి చెడుపు

- లీడర్ బోరున ఏడవడంతో నీరుగారిపోయిన క్యాడర్
- నాయకుడు ధైర్యం కోల్పోతే... సైన్యం స్థైర్యం కోల్పోతుంది
- అప్పడు చేసిన పాపం... ఇప్పడు బాబుకు శాపం
- కలసికట్టుగా తెరపైకొచ్చిన నందమూరి కుటుంబం

ఆంధ్ర రాజకీయాలు ఇప్పుడు కొత్త మలుపు తీసుకున్నాయి. *14* సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం, జాతీయ స్థాయి రాజకీయాలలో చక్రం తిప్పిన చరిత్ర కలిగిన సీనియర్ చంద్రం మీడియా ముందు ఒక్కసారిగా బోరున విలపించారు. రాజకీయంగా ఆయన భవిష్యత్తుకి శుభం కార్డు పడిపోయిందనడాన్ని ఈ సంఘటన స్పష్టం చేస్తుంది.

**యు**ద్ధంలో తన సైన్యానికి తాను భరోసాగా నిలబడి ముందుండి నడిపించేవాడే నిజమైన నాయకుడవుతాడు. ఎలాంటి వ్యతిరేక పరిస్థితులు ఎదురైనా మనోస్థైర్యాన్ని కోల్పోకుండా కదనరంగంలో దూకి తనవెంట నడిచేవారికి ధైర్యాన్ని కల్పించేవాడే వీరుడవుతాడు. ఇలా కెమెరాల ముందు కూర్చుని చిన్న పిల్లవాడిలా భోరున విలపించేవాడు లీడర్ కాలేదు సరికదా... ఇంకెప్పటికీ

10లో

## బతికుండగానే..
# ఆమెను చంపేశారు

దొరవారి సత్రం మండలం, తల్లంపాడు పంచాయితీలో బతికున్న వ్యక్తికి మరణ ధృవీకరణ పత్రం(డెత్ సర్టిఫికెట్) ఇచ్చి పరాకాష్టకు చేరిన తమ అవినీతిని మరోసారి ప్రదర్శించుకున్నారు రెవెన్యూ సిబ్బంది.

3లో

## కొలువైన కొత్త నేతలు

- నెల్లూరు నగర నాల్గవ మేయర్‌గా స్రవంతి
- బుచ్చి నగర పంచాయితీ తొలి చైర్‌పర్సన్‌గా సుప్రజ




(వివరాలు 5, 6 పేజీలలో)



## ఊళ్ళంతా నీళ్ళు.. ఇళ్ళల్లో కన్నీళ్ళు

- 40 ఏళ్ళలో చూడని వరద
- తీర్చలేని కష్టాలు.. పూడ్చలేని నష్టాలు

11లో

## స్పందించిన హృదయం..
# 50 లక్షల సాయం

వరద బాధితులకు బాసటగా విపిఆర్ దంపతులు

(వివరాలు 3వ పేజీలో)






## వరద నష్టాలు... ప్రజల కష్టాలు...

# పొర్లుకట్టలు గట్టిగా లేకపోవడం వల్లే

**- బిజెపి నేత మిడతల రమేష్**




సోమశిల ప్రాజెక్టునుంచి వచ్చే నీటి విడుదలను తట్టుకునేలా పెన్నా పరీవాహక ప్రాంతాల్లో పొర్లుకట్టలను మరింత గట్టిగా ఉండేలా పటిష్టం చేయాలని బిజెపి నాయకుడు, నమామిగంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల రమేష్ ఈనెల 22న నెల్లూరు కలెక్టరేట్‌లో ఉన్న డిఆర్‌ఓ చిన్నఓబులేసును కలిసి వినతిపత్రం సమర్పించారు. పొర్లుకట్టలు బలహీనంగా ఉండడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ వరదల్లో వందలాది కుటుంబాలు నష్టపోయాయని పేర్కొన్నారు. సోమశిల నుంచి పెన్నానదికి రెండువైపులా 80 కిలోమీటర్ల దాకా కేవలం 4 లక్షల క్యూసెక్కుల నీటిసామర్థ్యాన్ని మాత్రమే ఇప్పుడున్న మన పొర్లుకట్టలు తట్టుకోగలవని, అయితే ఒక్కసారిగా 6 లక్షల క్యూసెక్కులను వదలాల్సిన పరిస్థితుల్లో ముందుగానే పొర్లుకట్టలను పటిష్టం చేసుకోలేకపోవడం విచారకరమన్నారు. దీంతో సోమశిల డ్యామ్ దిగువన ఉన్న కేతామన్నేరు పల్లవోలు, బొగ్గేరు, పీరాపేరు, పందలవాగు, చవిటివాగు వగైరాల ద్వారా పెన్నానది ప్రవాహానికి మరో 2 లక్షల క్యూసెక్కుల నీరు అదనంగా వచ్చి చేరడంతో మొత్తంగా 8 లక్షల క్యూసెక్కుల నీటిప్రవాహాన్ని పొర్లుకట్టలు నిలువరించలేకపోవడం వల్ల పలు గ్రామాల్లో ప్రజలకు బాగా నష్టాలు సంభవించాయని ఆయన వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు ఈ పరిస్థితులన్నీ గమనించి భవిష్యత్తులో సైతం ఇబ్బందులు లేకుండా 8 లక్షల క్యూసెక్కుల నీటి సామర్థ్యాన్ని తట్టుకునేవిధంగా పొర్లుకట్టలను బాగా పటిష్టం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# గ్యాస్ లీకై.. ముగ్గురు దుర్మరణం



- మంటలకు ఆహుతైన భార్య-భర్త, కుమార్తె
- మల్లాంలో విషాదం

జీవనం గడుపుకోవడం కోసం టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ, వేకువనే నిద్రలేచి సాంబారు తయారుచేస్తుండగా మృత్యువు వారిని పొట్టనబెట్టుకుంది. ప్రమాదవశాత్తూ వంటగ్యాస్ లీకై మంటలు అంటుకుని ఆ కుటుంబంలోని ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. చిట్టమూరు మండలంలోని మల్లాం గ్రామంలో ఈనెల 22న ఈ ఘోరం జరిగిపోయింది. దీంతో మల్లాంలో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానికులు, పోలీసులు సమాచారం మేరకు..మల్లాంకు చెందిన సయ్యద్ అబ్బాస్ (42) భార్య నౌషాద్ (38)లు టిఫిన్ అంగడి నడుపుకునేవారు. సోమవారం వేకువన గ్యాస్‌స్టౌపై వంటలు తయారుచేస్తుండగా గ్యాస్ సిలిండర్ పైపు ప్రమాదవశాత్తూ ఊడిపోయి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో భార్యభర్తలిద్దరూ మంటల్లో చిక్కుకుని మరణించారని చిట్టమూరు పోలీసులు తెలిపారు. ఇల్లు చిన్నది కావడంతో, ఆ సమయంలో ఇంట్లో నిద్రపోతున్న కుమార్తె ఆయేషా(13)కు కూడా మంటలు అంటుకున్నాయి. దీంతో ఆమె కూడా తీవ్రగాయాలపాలైంది. తెల్లవారుజాము కావడంతో వెంటనే ఎవరూ ఈ విషాదాన్ని గుర్తించలేదు. చుట్టుపక్కల వారు గమనించేసరికి ఈ ఘోరమంతా జరిగిపోయింది. మంటలు అంటుకుని కొనవూపిరితో ఉన్న ఆయేషాను వెంటనే 108 వాహనంలో నెల్లూరులోని వైద్యశాలకు తరలించారు కానీ చికిత్సపొందుతూ ఆయేషా కూడా చనిపోయింది. గూడూరు డిఎస్పీ రాజగోపాలరెడ్డి, వాకాడు, చిట్టమూరు ఎస్ఐలు గోపీకృష్ణ, గోపి సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.






## వైద్య ఆరోగ్యశాఖలో

# ఖాళీలున్నాయి

**- దరఖాస్తు చేసుకోండి -**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పలు పోస్టుల్లో ఖాళీలున్నాయని, దరఖాస్తు చేసుకోండని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి (డిఎంఅండ్‌హెచ్ఓ) రాజ్యలక్ష్మి కోరుతున్నారు. ఈనెల 21న ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలోనూ, ఎఫ్ఎన్ఓ, శానిటర్ అటెండర్ కం వాచ్‌మన్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ విధానంలోనూ భర్తీ చేస్తామని, అర్హులైన వాళ్ళు డిసెంబరు 5వ తేదీలోగా నెల్లూరు సంతపేటలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎస్‌పిఎస్‌నెల్లూరు.ఏపి.జిఓవి.ఇన్/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌లో వివరాలున్నాయని ఆమె పేర్కొన్నారు.

### వైద్యవిధాన పరిషత్‌లోనూ ఖాళీలు భర్తీచేస్తాం :

ఆంధ్రప్రదేశ్ వైద్యవిధానపరిషత్ పరిషత్‌లోని సామాజిక ఆరోగ్యకేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, ఆత్మకూరు జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని ఖాళీపోస్టుల భర్తీకి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి ప్రభావతి మరో ప్రకటనలో కోరారు. ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ల్యాబ్ అటెండెంట్, రేడియోగ్రాఫర్, థియేటర్ అసిస్టెంట్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్, ఆడియో మెట్రీషియన్, ఫిజియోథెరపిస్ట్, జూనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, పోస్టుమార్టం అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైనవారు ఈనెల 29వ తేదిలోగా నెల్లూరు, మద్రాసు బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఎస్‌పిఎస్‌నెల్లూరు.ఏపి.జిఓవి.ఇన్/రిక్రూట్‌మెంట్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

## స్పందించిన హృదయం..

# 50 లక్షల సాయం

### వరద బాధితులకు బాసటగా విపిఆర్ దంపతులు



ఎప్పుడైనా, ఎక్కడైనా ఎవరికి ఏ ఆపద వచ్చినా తానున్నానంటూ స్పందించే రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మరోసారి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇప్పటికే జిల్లాలోనూ, జిల్లా బయటా అనేక ఆథ్యాత్మిక సేవా కార్యక్రమాలతో తన ఉదారతను ప్రదర్శిస్తున్న ఆయన తాజాగా నెల్లూరు జిల్లాను అతలాకుతలం చేసిన వరద బాధితులకు బాసటగా నిలిచారు. వరద బాధితుల సహాయార్థం 50 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందచేశారు. తన శ్రీమతి ప్రశాంతిరెడ్డి మేనేజింగ్ ట్రస్టీగా, తాను వ్యవస్థాపక ఛైర్మెన్‌గా ఉన్న విపిఆర్ ఫౌండేషన్ నుండి ఈ మొత్తాన్ని అందించారు. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు విదేశాలలో ఉన్నప్పటికీ తమ సంస్థ ప్రతినిధుల ద్వారా ఈ చెక్కును జిల్లా కలెక్టర్‌కి అందించారు. ప్రభాకరరెడ్డి ఓయస్‌డి సి.హెచ్.పెంచలరెడ్డి, విపిఆర్ సంస్థల జనరల్ మేనేజర్ విజయ్‌రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధి, 'విపిఆర్ అమృత ధార' పర్యవేక్షకుడు శంకర్, ప్రభాకరరెడ్డి వ్యక్తిగత సహాయకుడు సర్ఫ్‌రాజ్ కలెక్టర్ చక్రధరబాబుని కలిసినవారిలో ఉన్నారు.

## ముంపు సమస్య తీర్చేందుకు...

# త్వరలోనే ప్రణాళిక

**- పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి**



వరద బాధితులను స్వయంగా పరామర్శించేందుకు రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ఈనెల 24న ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. పలు ప్రాంతాల్లో ఆయన కాలినడకతోనే తిరుగుతూ బాధితులను ఆత్మీయంగా పలకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆత్మకూరు, చేజర్ల మండలలోని వాసిలి, అప్పారావుపాళెం, చెల్లపనాయుడుపల్లి, మాముడూరు, నడిగడ్డ అగ్రహారం, పెరుమాళ్ళపాడు, పుట్టుపల్లి, కొట్టాలు, ఉలవపల్లి తదితర గ్రామాల్లో మంత్రి పర్యటించారు. భారీ వానలు, వరదలు వచ్చినప్పుడల్లా పెన్నానదీ పరీవాహక ప్రాంతాల్లో అనేక గ్రామాలు ముంపుకు గురై ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ఈ ముంపు సమస్యలను నివారించేందుకు త్వరలోనే ప్రణాలిక రూపొందించి అమలుచేస్తామని మంత్రి గౌతంరెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రితో మాట్లాడి ముంపుకు గురయ్యే గ్రామాల్లో పటిష్టవంతంగా మోడల్ కాలనీల నిర్మాణాలకు కృషిచేస్తామన్నారు. వరద బాధితులను అన్నివిధాలా ప్రభుత్వం ఆదుకుంటోందని చెప్పారు. ఆత్మకూరు ఆర్డీఓ చైత్రవర్షిణి, నాయకులు కేతా వేణుగోపాల్‌రెడ్డి, తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రమాదేవి, ప్రసన్నలక్ష్మి, పార్థసారధి, తాజుద్దీన్ పాల్గొన్నారు.

## సెలవులో ఉన్న తహాశీల్దార్లకు పోస్టింగ్‌లు

దీర్ఘకాలంగా సెలవులో ఉన్న అయిదుగురు తహాశీల్దార్లకు పోస్టింగ్‌లు ఇస్తూ జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఈనెల 24న ఉత్తర్వులిచ్చారు. ఏవి రమణారావును దుత్తలూరు తహాశీల్దారుగా, వి.సుధీర్‌కుమార్‌ను కలెక్టరేట్ సి-సెక్షన్‌కు, కె.సతీష్‌కుమార్‌ను సీతారామపురం తహాశీల్దారుగా, సిహెచ్ పద్మావతిని వెంకటగిరి తహాశీల్దారుగా, బి.జయవర్ధన్‌రెడ్డిని సైదాపురం తహాశీల్దారుగా నియమించారు.

# బతికుండగానే.. ఆమెను చంపేశారు



**రాష్ట్ర రెవెన్యూ శాఖలో జరుగుతున్న విచ్చలవిడి అవినీతి మరోసారి బయటపడింది. బతికున్న వ్యక్తి పేరుమీద మరణ ధృవీకరణ పత్రం(డెత్ సర్టిఫికెట్) ఇచ్చి తమ బుద్ధి బయట పెట్టుకున్నారు ఆ శాఖ సిబ్బంది. ఆమె పేరు గోపాలం ప్రభావతి, ఆమె స్వస్థలం కావలి, ఆమె నివసించేది నెల్లూరులో. లక్షణంగా బతికున్న ఆమె సెప్టెంబర్ 27, 2021న చనిపోయినట్లుగా అక్టోబర్ 26, 2021న ధృవీకరించారు ఈ ఘనులు. సూళ్లూరుపేట నియోజకవర్గం, దొరవారిసత్రం మండలం, తల్లంపాడు పంచాయతి కార్యాలయంలో ఈ ఘనకార్యం జరిగింది.**

**వివరాల్లోకి వెళ్తే...**

గోపాలం ప్రభావతి సొంతూరు కావలి. ఆమె నెల్లూరులో నివాసం ఉంటోంది. ఆమె భర్త సుబ్రహ్మణ్యంరాజు చాలాకాలం క్రితం కాలం చేశారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. ఆమె పెద్దకుమారుడు గోపాలం రాజకుమార్‌కి విజయవాడకు చెందిన యువతితో పెళ్లి చేశారు ప్రభావతి. తమ కోడలు అన్నకే తమ కుమార్తెను కూడా ఇచ్చి కుండమార్పిడి వివాహం జరిపించారు. ఆ రెండు కుటుంబాలు విజయవాడలోనే కాపురం ఉండేవి. వారి జీవితాలు సవ్యంగా సాగుతున్న తరుణంలో ప్రభావతి కుమారుడు రాజ్ కుమార్ ఫిబ్రవరి 22, 2021న కరోనాకి బలై ప్రాణాలు వదిలాడు. రాజ్‌కుమార్ బతికున్న సమయంలో విజయవాడ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో లాకర్ ఉండేది. ఆ లాకర్‌కి తమ తల్లి ప్రభావతిని ఆయన నామినీగా పెట్టారు. ఆ విషయం ఆమెకు తెలియదు. అయితే ఆ లాకర్‌ను తమ కోడలు కుటుంబ సభ్యులు తెరిచి అందులో ఉన్న నగదు, డాక్యుమెంట్లను తీసేసుకున్నారని, చట్టపరంగా ఆలా తీసుకోవడానికి తాను కూడా చనిపోయినట్లుగా దొంగ ధ్రువీకరణ పత్రం సృష్టించారని తెలుసుకుని ఆమె అవాక్కయ్యారు.



GOVERNMENT OF ANDHRA PRADESH
DEPARTMENT OF HEALTH, MEDICAL AND FAMILY WELFARE
GRAMA PANCHAYAT THALLAM PADU
DEATH CERTIFICATE

NAME OF DECEASED : GOPALAM PRABHAVATHI
SEX : FEMALE
DATE OF DEATH : 27-09-2021 TWENTY-SEVENTH SEPTEMBER TWO THOUSAND TWENTY ONE
PLACE OF DEATH : TALLAMPADU, DORAVARISATRAM, SRI POTTI SRIRAMULU NELLORE, ANDHRA PRADESH
NAME OF HUSBAND / WIFE : GOPALAM SUBRAHMANYAMRAJU
DATE OF REGISTRATION : 26-10-2021
DATE OF ISSUE : 26-10-2021
ISSUING AUTHORITY : REGISTRAR (BIRTH & DEATH) GRAMA PANCHAYAT THALLAM PADU

### బ్యాంకు అధికారుల హస్తం...

ఈ తతంగంలో తమ కోడలు కుటుంబసభ్యులతో పాటు బ్యాంకు అధికారులు కూడా కుమ్మక్కయ్యారని ప్రభావతమ్మ ఆరోపిస్తున్నారు. తాను చనిపోయినట్లుగా ఇప్పటికే మరణ ధృవీకరణ పత్రం సృష్టించారు కాబట్టి తనను నిజంగా చంపేస్తారేమోనని ఆమె ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. గురువారం నాడు జిల్లా ఉన్నతాధికారులను కలుసుకుని ఫిర్యాదు చేశారు. నెల్లూరు నవాబుపేటలో ఉంటున్న ప్రభావతమ్మ ఇందుకూరుపేటలో నివసించేవారని సర్టిఫికెట్‌లో పొందుపరుస్తూ దొరవారిసత్రం మండలం, తల్లంపాడు గ్రామపంచాయతీ అధికారులు మరణ ధృవీకరణ పత్రం ఇచ్చారు.

తమ కోడలు బంధువులు రెవెన్యూ శాఖలోనూ, పోలీసు శాఖలోనూ విధులు నిర్వహిస్తున్నారని, వారి సహకారంతోనే ఇదంతా జరిగిందని ఆమె ఆరోపిస్తున్నారు. తనకు న్యాయం చేయడంతో పాటు, రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు.

బతికి ఉన్న మహిళను చనిపోయినట్లుగా ధృవీకరిస్తూ డెత్ సర్టిఫికెట్ ఇచ్చారంటే రెవెన్యూ శాఖలో అవినీతి తిమింగిలాలు ఏ స్థాయికి దిగజారాయో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

ద్వితీయ వర్ధంతి




ఆయన జీవితం ఓ మధురమైన గతమైనా...
ఆయన జ్ఞాపకాలే ఎప్పటికీ మా గుండెచప్పుళ్ళు.

శ్రీ ఆనం వెంకటకృష్ణారెడ్డి (A.V.K) గారు

పరమపదించి తేది. 30.11.2021 నాటికి రెండేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ మహనీయుని ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

భార్య - ఆనం లలిత
మరియు కుటుంబసభ్యులు

## 'ప్రభా'తం

# 'వాహన యోగం' మంచిదే.. కానీ!.

ఈ అధునాతన కాలంలో వాహనాల వినియోగం పెరిగిపోతుండడం అనివార్యమే అవుతోంది. అయితే, 'వాహన యోగం' కలిగిందని సంతోషపడాల్సిన సమయంలో అంతకుమించి వాహనాల ప్రమాదాలు కూడా భారీగా జరుగుతుండడమే బాధాకరం. మనదేశంలో రోడ్లు, జాతీయ రహదారులు బాగుండేది కూడా అంతంత మాత్రమే! రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచంలోనే భారత్ ప్రథమస్థానంలో ఉందని నిపుణులు నివేదికలు వెల్లడిస్తున్నాయి. అతి వేగంతో కాక నిబంధనలు పాటిస్తూ, ఎవరికి వారు స్వీయ భద్రతతో వాహనాలు నడుపుకోగలిగితే ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించుకోవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.



ధనయోగం, గృహయోగం వగైరాలతో పాటు ఇటీవలికాలంలో 'వాహనయోగం' కూడా ఎంతో ముఖ్యమైపోయింది. ఒకప్పట్లో వాహనంలో వెళ్తే పెద్ద అదృష్టవంతుడి కింద లెక్క. ఇప్పుడు వాహనం లేనివారు నిజంగా దురదృష్టవంతులే.. అదీ లెక్క. నిద్రమంచం లేచిందగ్గరనుంచి కూరగాయలకు వెళ్ళాలన్నా, కార్యాలయాలకు వెళ్ళాలన్నా ఎక్కడికి వెళ్ళాలన్నా బండి తీయాల్సిందే. అది స్కూటరో, బైకో, కారో, జీపో ఏదైనా కావచ్చు. వాహనం లేకుండా నడవలేని రోజులు వచ్చేశాయి. సరైన సమయానికి వాహనం లేకపోతేనో, లేక రాకపోతేనో పడే బాధలు అన్నిన్ని కావు. ఒకప్పుడంటే ఎవరో గొప్పవాళ్లకి వాహనాలుండేవి. ఇప్పుడలా కాదు మధ్యతరగతి వారు, ఉద్యోగులు, ఆర్థిక వెసులుబాటు ఉన్నవారంతా ముందుగా వాహనయోగానికే ప్రధమ ప్రాధాన్యత ఇస్తున్నారు. బండి లేకుండా బతుకుబండి గడవడం లేదిప్పుడు. గతంలో ఒకవీధికి ఒకటో రెండో కార్లుంటే, ఇప్పుడు కనీసం పది పదిహేను కార్లకు తక్కువ ఉండడం లేదు. ఇక ద్విచక్రవాహనాలు లేని వారు బహుఅరుదు. వాహనలు పెరిగిపోతుండడంతో ఎక్కడ చూసినా ట్రాఫిక్ పెరిగిపోతూనే ఉంది. రోడ్లమీద పెద్దసంఖ్యలో వాహనాలు నిలబడిపోవడం, గంటల తరబడి ట్రాఫిక్ స్తంభనతో పట్టణాలు, నగరాల్లో ప్రయాణం నరకయాతనగానే ఉంటోంది. అయినా వాహనం ఉంటే సౌకర్యం అన్నమాట అందరికీ ఆచరణ యోగ్యంగా మరింది. ఒకప్పుడు లగ్జరీ అనుకున్న వాహనయోగం, ఇప్పుడు అత్యవసరంగా మారింది. ఒక్కమాటలో చెప్పాలంటే వాహనమన్నది నిత్య జీవితంలో ఒక భాగమైపోయింది. అయితే. వాహన యోగం మంచిదే కానీ.. అజాగ్రత్తగా ఉంటే ప్రాణాలకే ప్రమాదం. మన దేశంలో పెరుగుతున్న వాహనాలతో పాటు పెరుగుతున్న ప్రమాదాలను తలచుకుంటేనే ఆందోళనగా ఉంటోంది.

ఈ అధునాతన కాలంలో వాహనాల వినియోగం పెరిగిపోతుండడం అనివార్యమే అవుతున్నా, అంతకుమించి ప్రమాదాలు కూడా జరుగుతుండడమే బాధాకరం. మనదేశంలో రోడ్లు, ముఖ్యంగా నిత్యం కోట్లాదివాహనాలు ప్రయాణించే జాతీయ రహదారులు బాగుండడం కూడా అంతంత మాత్రమే! ఎక్కడైనా రోడ్లు బాగా విశాలంగా ఉంటే అతివేగంతో వాహనాలు నడపడంతో నిత్యం ప్రమాదాలు పెరిగిపోతూనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఇలాంటి ప్రమాదాలు భారీగా పెరిగిపోయి రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచంలోనే భారత్ ప్రథమస్థానంలో ఉందంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో గ్రహించాలి. దేశవ్యాప్తంగా ప్రతిఏటా రహదారుల నిర్మాణాలు భారీగా పెరుగుతున్నా, దాంతో పాటు ప్రమాదాలు కూడా పెరిగిపోతున్నాయి. అమెరికా, చైనాల కంటే మనదేశంలోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువని నిపుణులు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రతి ఏటా ప్రమాద ఘటనల సంఖ్య పెరిగిపోతూనే ఉంది. ప్రమాదాల్లో మరణించినవారు, లేదా తీవ్ర గాయాలపాలవుతున్న వారి సంఖ్య కూడా భారీగానే ఉంటోంది. గత ఏడాది దేశంలో దాదాపు నాలుగున్నర లక్షల రోడ్డు ప్రమాదాలు జరిగితే, లక్షా 50వేల మందికి పైగానే మరణించారని, మరో నాలుగున్నర లక్షల మందికి పైగానే గాయాల పాలయ్యారని ప్రభుత్వ గణాంకాలే చెప్తున్నాయి. ఈ లెక్కన సగటున రోజుకు సుమారు నాలుగు వందల మందికి పైగానే మరణిస్తున్నారన్నది నిపుణుల ఆవేదన. దేశంలో జరుగుతున్న రోడ్డుప్రమాద ఘటనల్లో ఎక్కువ మరణాలు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, బెంగాల్, బీహార్, గుజరాత్, హర్యానా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలున్నాయని ప్రభుత్వమే తన నివేదికల్లో చెప్తోంది. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రవాణా మంత్రిత్వశాఖ అనేకరకాల ప్రణాళికలు అమలుచేస్తూనే ఉంది, కానీ ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. విలాసవంతమైన, అత్యంత ఆధునికమైన కార్లు, జీపులు తదితర వాహనాల్లో ప్రయాణాలు చేసేవారి సంఖ్య రానురాను భారీగా పెరిగిపోతోంది. ముఖ్యంగా యువత డ్రైవింగ్ పట్ల ఎక్కువ మక్కువ చూపుతుండడం ఆహ్వానించదగ్గ పరిణామమే అయినా, అత్యుత్సాహంతో విపరీతమైన వేగంతో వాహనాలు నడిపి ప్రాణాల మీదికి తెచ్చుకునేది కూడా ఎక్కువ శాతం యువకులేనని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అందుకే రోడ్ల మీద వాహనాలు నడిపేవారికి బోలెడన్ని నిబంధనలుంటాయి. వాహనాల డ్రైవింగ్‌కు ఖచ్చితమైన శిక్షణ ఎంతో అవసరం. నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ, జాగ్రత్తగా వాహనాలు నడపగలిగినప్పుడే క్షేమంగా ఇల్లు చేరగలం. అందులోనూ ఈ కరోనా మహమ్మారి నేపథ్యంలో ఇతరత్రా అద్దె వాహనాల్లో క్రిక్కిరిసిన ప్రయాణీకుల మధ్య ఎక్కడికి వెళ్ళాలన్నా భయమే. దీంతోపాటు సొంత వాహనాల్లో ప్రయాణాలు కూడా భయంగానే తయారైతే ఎలా?..ఒక్క జాతీయ రహదారులనే కాదు, దేశంలోని అనేక నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ఉన్న ప్రధానమైన రోడ్లల్లోనూ ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. నిబంధనలు పాటించకపోవడం, నిద్రమత్తులో వాహనాలు నడపడం, కావాలనే అతి వేగంగా వాహనాలు నడిపి అదో పెద్ద హీరోయిజంగా భావించడం వగైరా కారణాలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. రోడ్లు, జాతీయరహదారుల మీద వాహనాలు నడిపేవారు, నడిచేవారు అందరూ ఒక క్రమపద్ధతిలో నడవాలి. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను క్రమశిక్షణతో పాటిస్తే పెద్ద సమస్య ఉండదు. దురదృష్టవశాత్తూ మనదేశంలో అదే పెద్ద లోపం. అందరూ జాగ్రత్తగా, నిబంధనలు పాటిస్తూ, మెళకువతో వాహనాలు నడపగలిగితే నిజంగానే 'వాహన యోగం' ఎంతో మంచిదవుతుంది. అందుకు తగు శిక్షణ, క్రమశిక్షణ రెండూ అవసరం. అప్పుడే ప్రభుత్వాలే కాదు ప్రజలు కూడా ఆశిస్తున్నట్లుగా..వాహనాలు ఎంతగా పెరిగినా..రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయి.

# శ్రీ మూలస్థానేశ్వరునికి.. లక్ష దీపోత్సవ కాంతులు



టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, శ్రీవేంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు మూలాపేటలో ఉన్న భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవాలయంలో నేత్రపర్వంగా లక్ష దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆలయప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించారు. మహాశివలింగాన్ని చిత్రించి దీపాల వరుసలతో కళకళలాడించారు. పుష్పమాలికలతో, దీపాల వెలుగులతో ఆలయం దేదీప్యమానమైంది. 'ఓం నమ:శివాయ' అంటూ భక్తులు పెద్దపెట్టున చేసిన శివనామోచ్చరణలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్, టిటిడి ధర్మప్రచారపరిషత్తు అధికారి ఎన్.దేవరాజులు, కళాదీప్తి సుబ్రహ్మణ్యం తదితరుల ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చీమకుర్తి వెంకటేశ్వరరావు పాల్గొని కార్తీక పౌర్ణమి వైశిష్ట్యాన్ని, కార్తీకదీపోత్సవ విశిష్టతను ఈ సందర్భంగా భక్తులకు వివరించారు.

# చేనేతకారులను ఆదుకోండి సారూ...




గత కొద్దిరోజులుగా జిల్లాలో కురిసిన భారీ వానలు, వచ్చిన వరదల దెబ్బకు పేద చేనేతకారులమైన మా జీవితాలు సమస్యల సుడిగుండంలో పడ్డాయి. అసలే ఈ వానల్లో పనులు దొరక్క పూట గడవక నానా బాధలు పడుతుంటే... వచ్చిన వరదల దెబ్బకు మగ్గం గుంటల్లో నీళ్ళు నిలిచిపోయి నేత పని పూర్తిగా నిలిచిపోయింది. ఒకవైపు అర్ధరాత్రి సమయంలో ఇళ్ళలోకి నిండా నీళ్లు రావడంతో పిల్లా పాపలను చేతపట్టుకుని కట్టుబట్టలతో బయటపడ్డాం. పెన్నా నది చుట్టుప్రక్కల ఉన్న పల్లెల్లో నేత నేసుకునేవాళ్ళమంతా వానలు, వరదలు వచ్చినప్పుడల్లా పడుతున్న బాధలు చెప్పనలవికాదు. నూలు తడిసిపోయి, నేసిన వస్త్రాలు నీళ్ళలో నానిపోయి దేనికీ పనికిరాకుండా పోతున్నాయి. ఎంతో నైపుణ్యంతో నేత నేసినా ప్రకృతి విపత్తులతో మా జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి. శాశ్వత ప్రాతిపదికపై ఈ సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవలసిందిగా ప్రార్థిస్తున్నాము.

*బి.సుబ్బరామయ్య,* **లేగుంటపాడు.**

# చేజర్లలో పేదలకు ఉచిత వైద్యపరీక్షలు



తమ తండ్రి ప్రవాస భారతీయుడైన చుండి తిమ్మారెడ్డి సతీమణి సుశీలమ్మ జ్ఞాపకార్థం వారి కుమార్తె డాక్టర్ పద్మ, అల్లుడు డాక్టర్ మోహన్‌లు ఈనెల 20న మండలకేంద్రమైన చేజర్లలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి అనేకమంది పేదలకు వైద్యపరీక్షలు చేసి వారికి అవసరమైన ఆరోగ్యసలహాలు, మందులు అందజేసి తమ సేవాభావం చాటుకున్నారు. మాతృభూమిపై మమకారంతో, తల్లితండ్రుల స్ఫూర్తితో వారు ఈ కార్యక్రమం నిర్వహించారు. కిడ్నీ, లివర్, గుండె వ్యాధులు, షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలను గ్లోబల్ టెలిక్లినిక్–హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో చేపట్టారు. అనారోగ్య సమస్యలు, పలు రకాల వ్యాధులు ఎందుకు వస్తాయో, వాటిని ముందుగానే ఎలా గుర్తించి తగు పరీక్షలు చేసుకుని చికిత్సలు చేయించుకోవాలో గ్రామీణులకు ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ వివరించారు. చేజర్ల పిఏసిఎస్ ఛైర్మన్ బూదళ్ళ వీరరాఘవ రెడ్డి, చలమారెడ్డి, బూదళ్ల రామ్మోహన్‌రెడ్డి, దొరస్వామిరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# ఆర్టీసీకి కోటిపైగా నష్టం

భారీ వర్షాలు, వరదల ధాటికి జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో వాగులు, వంకలు పొంగుతూ రోడ్లు దెబ్బతినడంతో అనేక ఆర్టీసీ బస్సులను రద్దు చేశారు. ఇప్పటికే 200కుపైగా బస్సు సర్వీసులను రద్దు చేశామని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. దీంతో ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌కు దాదాపు కోటి రూపాయలకు పైగానే నష్టం వాటిల్లినట్లు సమాచారం.

# రోడ్లు ధ్వంసం

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు దాదాపు 615 కిలోమీటర్ల పరిధిలో రోడ్లు దెబ్బతిన్నాయని, వీటికి మరమ్మతులు చేసే కృషిలో ఉన్నామని ఆర్ & బి వర్గాలు పేర్కొన్నాయి.

# ఈ రోడ్లు ఇంకెప్పటికి బాగుపడతాయో?

అసలే నెల్లూరు రోడ్లు సుందరముదనష్టంగా ఉంటాయి. దానికి తోడు ఇప్పుడు ఈ వానలు, వరదలొకటి. ఎక్కడ చూసినా రోడ్లన్నీ పెచ్చులు లేచిపోయి గుంటలు పడిపోయాయి. నగరంలోని బాలాజీనగర్, ఏసి నగర్, స్టోన్‌హౌస్‌పేట, మూలాపేట, దర్గామిట్ట, కరెంటు ఆఫీసు సెంటర్, వేదాయపాళెం, పొదలకూరురోడ్డు, డైకస్‌రోడ్డు.. ఇలా అనేకమైన ప్రధానమైన రోడ్లు ఈ వానల దెబ్బకు అక్కడక్కడా బాగా దెబ్బతిన్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఎంతో కష్టంగా ఉంది. ఈ రోడ్లలో బైకులపై వెళుతుంటే నడుములు విరిగిపోతున్నాయి. నడవాలన్నా కూడా ఎంతో కష్టంగా ఉంటోంది. అనేక రోడ్లకు గత కొద్దికాలంగా మరమ్మతులు చేయకపోవడంతో ఇప్పటికే గుంటలు పడి ఉన్నాయి. ఎంతకాలం ఎదురుచూసినా ఈ రోడ్లకు కనీసం ప్యాచ్ వర్కులు చేసే వాళ్ళు కూడా కనిపించడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద పెద్ద వాళ్ళంతా ఈ రోడ్లమీదనే వాహనాల్లో వెళుతుంటారు తప్ప, ఈ రోడ్ల దుస్థితిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులైనా ఈ రోడ్లను బాగు చేసేందుకు సంబంధిత అధికారులను ఆదేశిస్తారని ఆశిద్దాం.


*కె.సీతారామసింగ్,* **నెల్లూరు.**

# కళ్యాణ వైభవం...!

## సాయిశరణ్ - గీతిక



నిప్పో బ్యాటరీస్, తడ పరిశ్రమలో హెచ్.ఆర్ విభాగంలో అసోసియేట్ వైస్‌ప్రసిడెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మృధుస్వభావి, సౌమ్యశీలి, మితభాషి పార్లపల్లి వెంకటమోహన్‌రామిరెడ్డి - శ్రీమతి ఉమల ద్వితీయ కుమారుడు **సాయిశరణ్‌రెడ్డి - గీతికరెడ్డి** (సూళ్లూరుపేట వాస్తవ్యులు పల్లంపర్తి గోపాల్‌రెడ్డి - శ్రీమతి శర్వాణిల కుమార్తె) పెళ్ళి నవంబర్17వ తేదీ జరిగింది. ఉదయం జరిగిన కళ్యాణ వేడుకలోను అదే రోజు సాయంత్రం జరిగిన రిసెప్షన్‌లోను ఇరు కుటుంబాల బంధుమిత్రులతో పాటు, సన్నిహితులు, స్నేహితులు, ఆప్తులు, ఆత్మీయులు పాల్గొని కొత్త దంపతులను ఆశీర్వదించారు. సాయిశరణ్ - గీతికలకు 'లాయర్' శుభ దీవెనలు.



# వరద బాధితులను ఆదుకుంటాం



జిల్లాలో భారీ వర్షాలు, వరదలకు గురై కష్టనష్టాలు పడుతున్న బాధితులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో 20 మండలాల్లో 47వేల మంది దాకా ప్రజలు నిరాశ్రయులు కావడంతో వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించి అన్నం, మంచినీటి వసతులు కల్పిస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు తదితర అధికారులంతా వరద బాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 22న మంత్రులు శ్రీనివాసరెడ్డి, డా.అనిల్ అధికారులతో కలసి నెల్లూరు నగరంలో ముంపుకు గురైన పలు ప్రాంతాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ వరద బాధితుల పరిస్థితిని ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చెప్తున్నామని, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు తక్షణం తగు సాయం చేయాలని ఆదేశించారని తెలిపారు. వార్డు, గ్రామ సచివాలయాల్లోనే బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి 5800 రూపాయల వంతున ఆర్థికసాయంతో పాటు పాతిక కిలోల బియ్యం, కిలో కంది పప్పు, కిలో ఎర్రగడ్డలు, కిలో ఉల్లగడ్డలు, లీటరు పామాయిల్ అందజేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో ఆ విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదేవిధంగా పంట నష్టపోయిన రైతులకు, ఇళ్ళు నష్టపోయిన వారికి కూడా నష్టం అంచనాలు వేసి ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెన్నా పరీవాహక ప్రాంతాల్లో ముంపు సమస్యను శాశ్వత ప్రాతిపదికపై పరిష్కరించేందుకు, ఫ్లడ్‌బ్యాంక్ నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వందకోట్ల రూపాయలు మంజూరు చేశారని, ఆ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతవాసులకు ముంపు ముప్పు తప్పుతుందని మంత్రి అనిల్ చెప్పారు. నగరంలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీ, జనార్దనరెడ్డి కాలనీ, ఇస్లాంపేటకు చెందిన దాదాపు 5వేల కుటుంబాలు వరద బారినపడ్డాయని ఆయన పేర్కొన్నారు.

## బుచ్చి నగర పంచాయతీ

# ఛైర్‌పర్సన్‌గా సుప్రజ





బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీకి నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం ఈనెల 22న జరిగింది. ఎన్నికల పరిశీలకులు షణ్ముఖకుమార్ సమక్షంలో ఎన్నికల అధికారి సాంబశివారెడ్డి కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. 4వ వార్డు నుంచి ఎన్నికైన మోర్ల సుప్రజను ఛైర్‌పర్సన్‌గా సభ్యులు ప్రతిపాదించి బలపరచడంతో సుప్రజ ఛైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 19వ వార్డులో గెలిచిన కోటంరెడ్డి లలిత, 5వ వార్డులో విజయం సాధించిన షాహుల్‌ను వైస్‌ఛైర్‌పర్సన్లుగా ఎన్నిక చేసుకున్నారు. అనంతరం వీరిని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సన్మానించి అభినందించారు. ఎన్నికైనవాళ్ళంతా ప్రజా సేవకు అంకితమై పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతి, వవ్వేరు బ్యాంకు ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి, పట్టణ వైకాపా అధ్యక్షుడు ఇన్నమూరి నరసింహరావు, నాయకులు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, సిహెచ్ సతీష్‌రెడ్డి, కె.మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'విజయపథంలో నెల్లూరీయులు'

'లాయర్' పత్రిక 40వ వార్షికోత్సవ కానుకగా 40 మంది విజయగాధలతో ప్రతిష్టాత్మకంగా ప్రచురించిన ' విజయపథంలో నెల్లూరీయులు 'కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ మహోత్సవానికి హాజరు కాలేకపోయిన 40 మందిలో కొందరు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి, అదాల ప్రభాకరరెడ్డి, అదాల మురళీకృష్ణా రెడ్డి, డాక్టర్ కంచర్ల రమేష్, జీ.వీ. ప్రసాద్‌రెడ్డిలను హైదరాబాదులో కలసి పుస్తక ప్రతిని అందిస్తున్న శివప్రభాత్ రెడ్డి (ప్రభు).











# నెల్లూరు కబుర్లు

## 'సఫాయిమిత్ర'లో కార్పొరేషన్‌కు జాతీయ అవార్డు

### 10 కోట్లను ప్రోత్సాహకంగా ప్రకటించిన కేంద్రం



సఫాయిమిత్ర సురక్ష చాలెంజ్ కార్యక్రమంలో నెల్లూరు కార్పొరేషన్ జాతీయస్థాయి ర్యాంకుల్లో ప్రథమస్థానం సాధించింది. దీంతో ఈనెల 20న ఢిల్లీలోని విజ్ఞానభవన్‌లో నెల్లూరు నగర కమిషనర్ కె.దినేష్‌కుమార్ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హరదీప్‌సింగ్ చేతులమీదుగా ఈ విశిష్టమైన అవార్డును అందుకున్నారు. అవార్డుతో పాటు, నెల్లూరు కార్పొరేషన్ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం 10 కోట్ల రూపాయల నగదును ప్రోత్సాహకంగా ప్రకటించింది. నగరంలో పారిశుద్యాన్ని మెరుగుపరచడంతో పాటు సఫాయిమిత్రలకు కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న సహకారం, ఆర్థికచేయూత, పరికరాలు సమకూర్చడం వంటి అంశాలను పరిశీలించిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నెల్లూరు కార్పొరేషన్‌కు ఈ అవార్డును బహుకరించింది. 10లక్షల లోపు జనాభా ఉన్న కార్పొరేషన్‌లలో నెల్లూరు కార్పొరేషన్ ఈ విశిష్టమైన అవార్డును సొంతం చేసుకోవడం తనకెంతో సంతోషంగా ఉందని అంటూ ఈ అవార్డు వచ్చేందుకు సహకరించిన అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది అందరికీ ఈ సందర్భంగా కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ తన ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎంసిఏలో కృష్ణచైతన్య హవా



విక్రమసింహపురి యూనివర్శిటీ తాజాగా విడుదల చేసిన మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్ (ఎంసిఏ) 5వ సెమిస్టర్ ఫలితాల్లో నెల్లూరులోని కృష్ణచైతన్య కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ ర్యాంకుతో పాటు 15 ర్యాంకులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈనెల 22న కళాశాలలో జరిగిన అభినందన సభలో కళాశాల డైరెక్టర్లు డా.ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన బి.శ్వేత 91.4 శాతం మార్కులతో ప్రథమస్థానం సాధించిందని, ఎస్‌డి రోషన్ 90.6 శాతం మార్కులతో ద్వితీయస్థానం, 90.2 శాతం మార్కులతో టిహెచ్ అలేఖ్య తృతీయ ర్యాంకు కైవసం చేసుకుందని తెలిపారు. 90శాతం పైగా మార్కులతో 10 మంది, 85 శాతం పైగా మార్కులతో 60 మంది, 80 శాతం పైగా మార్కులతో 220 మంది తమ కళాశాల విద్యార్థులు ఉత్తీర్ణులు కావడం ఆనందం కలిగిస్తోందంటూ విద్యార్థులందరినీ వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ మల్లికార్జునయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## అజీజ్ ఆధ్వర్యంలో ఆహారపొట్లాలు



నెల్లూరు, వెంకటేశ్వరపురం, దొరతోపు కాలనీల్లోని వరదబాధితులకు ఈనెల 20న తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో టిడిపి నాయకుడు డాక్టర్ జెడ్ శివప్రసాద్ సారథ్యంలో ఆహారపొట్లాలు అందజేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, నాయకులు తిరుమలనాయుడు, కనుపర్తి గంగాధర్, జలదంకి సుధాకర్, సాబిర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు బాగా చదువుకోవాలి

### - ఐటిడిఎ మానిటరింగ్ అధికారి శాంతకుమారి

బాలికలు బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ఐటిడిఏ మానిటరింగ్ అధికారి శాంతకుమారి చెప్పారు. జాతీయ బాలల దినోత్సవం ముగింపు సందర్భంగా ఈనెల 20న నెల్లూరు నగరంలోని పొదలకూరురోడ్డులో ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, బాలురతో ధీటుగా బాలికలు కూడా బాగా చదువుకోవాలని, బాలికల చదువులకు ప్రతిఒక్కరూ ప్రోత్సాహం అందించాలని కోరారు. బాలికలు విద్యావంతులైతేనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గురకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మనోజకుమారి, స్వచ్ఛంధసంస్థల ప్రతినిధులు శ్రీలత, విజయమోహన్, విద్యార్థినులు పాల్గొన్నారు.

## బాధితులకు కార్పొరేటర్ల భోజనం

భారీ వరదల కారణంగా నెల్లూరు నగరంలోని పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు నగర కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, సయ్యద్ తహసీన్, గుంజి జయలక్ష్మి, వందవాశి రాజేశ్వరి, షేక్ సఫియాబేగంలు అన్నం ప్యాకెట్లు అందజేశారు. నెల్లూరులోని డికెడబ్ల్యు కాలేజీ, పాత మునిసిపల్ కార్యాలయం, గుంటబడి తదితర ప్రాంతాల్లో ఉన్న పునరావాస కేంద్రాలను సందర్శించి ముంపు బాధితులకు ఆహారం అందించి వారికి అండగా అందరం ఉన్నామంటూ భరోసా ఇచ్చారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

జిల్లాలోని ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రోజ్‌మాండ్ ఈనెల 20న నోటిఫికేషన్ విడుదల చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు 56, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు 11, సహాయకుల పోస్టులు 247 ఖాళీగా ఉన్నాయని, అర్హులైనవారు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో డిసెంబరు 2వ తేది సాయంత్రం 5 గంటలలోగా పంపాలని తెలిపారు. పోస్టుల ఖాళీల వివరాలను సిడిపిఓ కార్యాలయం, వార్డు, గ్రామ సచివాలయాల నోటీసు బోర్డుల్లో పొందుపరిచామని, ఆసక్తిగల అభ్యర్థులు డిసెంబరు 2వ తేదీలోపు ఆయా వార్డు, గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# కొలువుతీరిన కొత్త పాలకవర్గం

- నెల్లూరు 4వ మేయర్‌గా.. పొట్లూరి స్రవంతి
- డెప్యూటి మేయర్లుగా రూప్‌కుమార్‌యాదవ్, ఎం.డి ఖలీల్
- ప్రతిపక్షానికి ప్రాతినిథ్యం నిల్



నెల్లూరు నగర పాలక సంస్థ కొత్త పాలకవర్గం ఈనెల 22న ఏర్పాటైంది. ఇటీవల జరిగిన పురపోరులో వైకాపా నెల్లూరులోని 54 డివిజన్లలోనూ ఘనవిజయం సాధించడం, ప్రతిపక్ష పార్టీలేవీ ఒక్కస్థానం కూడా సాధించలేకపోవడంతో కౌన్సిల్‌లో ప్రతిపక్షానికి ప్రాతినిధ్యం లేకుండాపోయింది. కౌన్సిల్‌లో ప్రతిపక్షం లేని పాలకవర్గంగా చరిత్ర సృష్టించింది.





నెల్లూరు మేయర్‌గా 12వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి స్రవంతి 4వ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డెప్యూటి మేయర్లుగా 40వ డివిజన్ కార్పొరేటర్ రూప్‌కుమార్‌యాదవ్, 43వ డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ ఎం.డి ఖలీల్ అహ్మద్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులు బసంత్‌కుమార్ సమక్షంలో, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాలకమండలి ప్రత్యేక సమావేశంలో 54 మంది కార్పొరేటర్లతో, జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి కెవిఎన్ చక్రధర్ బాబు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

### కార్పొరేషన్ అభివృద్ధే లక్ష్యంగా...

అనంతరం మంత్రి డాక్టర్ అనిల్ విలేకర్లతో మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఘనవిజయం సాధించిపెట్టిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికైన సభ్యులంతా కార్పొరేషన్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. మూడు నెలలకోసారి కాకుండా ప్రతి నెలా పాలకమండలి సమావేశాన్ని నిర్వహించి ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు అందరూ కృషిచేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు రాజకీయంగా అవకాశం కల్పించాలనే గొప్ప ఉద్దేశ్యంతో అందరికీ పదవుల్లో సమన్యాయం పాటిస్తున్నారని చెప్పారు. కష్టపడే ప్రతి కార్యకర్తకు తమ పార్టీలో గుర్తింపు ఉందనడానికి నెల్లూరు మేయర్, డెప్యూటి మేయర్ల ఎన్నికే నిదర్శనమని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు.

## నీట్‌లో.. ప్రతిభ చాటుకున్న 'రత్నం' విద్యార్థులు

- 100 మందికి పైగా విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు


డి.సరయు


జి.మనోజ


వై. సిరిరాయల్

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23న విడుదల చేసిన నీట్-2021 రాష్ట్ర ఫలితాల్లో నెల్లరులోని రత్నం మెడికల్ అకాడమీ, తిరుపతి డాక్టర్స్ మెడికల్ అకాడమీ (కృష్ణారెడ్డి శ్రీచైతన్య అకాడమీ) విద్యార్థులు తమ ప్రతిభ చాటుకున్నారు. తమ విద్యార్థులు డి.సరయు 171వ ర్యాంకు సాధించిందని వారు పేర్కొన్నారు. అదేవిధంగా జి.మనోజ్ఞ 204వ ర్యాంకు, వై.సిరిరాయల్ 208వ ర్యాంకు, పి.వెంకటశివానిరెడ్డి 312, బి.మహీధర్‌రెడ్డి 607, కె.హంపి 665, సిహెచ్ శ్రీదుర్గాకావ్య 672, పి.సౌమ్యశ్రీ 885, వి.వెంకటనారాయణ 976, ఆర్.మీనాక్షి 978వ ర్యాంకు సాధించారని కళాశాలల ఛైర్మెన్‌లు కె.వి.రత్నం, బి.వి.కృష్ణారెడ్డిలు తెలియజేశారు. తమ విద్యార్థులు మొత్తం వెయ్యి లోపు 10 ర్యాంకులు, 2వేల లోపు 35 ర్యాంకులు, 3వేల లోపు 51 ర్యాంకులు, 4వేల లోపు 89 ర్యాంకులు, 5వేల లోపు 103 ర్యాంకులు, మొత్తం 100 మందికి పైగా విద్యార్థులు ఉచిత మెడికల్ సీట్లు సాధించారని వారు సంతోషం వ్యక్తం చేశారు. సీనియర్ అధ్యాపక బృందంతో బోధన, స్టడీ అవర్స్ నిర్వహించడం వగైరాలు ఈ విజయానికి కారణమంటూ, ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులందరినీ వారు అభినందించారు.

## గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుక




జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా నెల్లూరులోని రేబాలవారివీధిలో ఉన్న కేంద్ర గ్రంథాలయంలో ఈనెల 20న వారోత్సవాల ముగింపు వేడుక సందడిగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జిల్లా గ్రంథాలయసంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ సిహెచ్ ప్రసాద్, ప్రజాసైన్సు వేదిక పట్టణశాఖ అధ్యక్షుడు సతీష్‌కుమార్‌తో పాటు గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



### రాష్ట్రంలోని వరద పరిస్థితిపై..

# ప్రధాని మోడీకి ఉప రాష్ట్రపతి సమాచారం



రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వరద పరిస్థితిని గురించి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రధాని నరేంద్రమోడీకి, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఈనెల 22న ఫోన్‌లో వివరించారు. విశాఖ పర్యటనలో ఉన్న ఉప రాష్ట్రపతి వారిద్దరితోనూ మాట్లాడుతూ ప్రధానంగా చిత్తూరు, అనంతపురం, నెల్లూరుజిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు, వరద తీవ్రత ఎక్కువగా ఉందని, కేంద్రప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరగా అందుకు స్పందించిన నేతలు ఆ మేరకు వెంటనే సహాయక చర్యలు అందజేస్తామన్నారు.

### ఢిల్లీలో.. కన్నులపండువగా

# సత్యనారాయణస్వామి వ్రతం

## వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సారథ్యంలో ప్రత్యేకపూజలు



కార్తీకపౌర్ణమి సందర్భంగా దేశరాజధాని న్యూఢిల్లీలో ఈనెల 19న తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో కన్నులపండువగా శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఉత్తరభారతదేశంలోని టిటిడి ఆలయాల లోకల్ అడ్వయిజరీ కమిటీ ప్రెసిడెంట్, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నేతృత్వంలో స్వామివారికి ప్రత్యేకపూజలు జరిగాయి. అనంతరం భక్తులంతా కలసి నేత్రపర్వంగా కార్తీకదీపోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు శ్రీ సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొని, అనంతరం ఎంతో భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. హిందువులందరికీ ఎంతో పవిత్రమైన కార్తీక మాసంలో శ్రీ సత్యనారాయణస్వామి వ్రతంతో పాటు, కార్తీకదీపోత్సవం జరగడం తనకెంతో సంతోషం కలిగిస్తోందని, నవంబరు 4వ తేది వరకు ప్రతిరోజూ 108 కార్తీకదీపాలు వెలిగించే కార్యక్రమంలో భాగంగా ఈ కార్తీకదీపోత్సవం నిర్వహించామని ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే అంటే ఇలా ఉండాలి!

- వరదకాలంలో ప్రజలకు ప్రసన్న సేవలు
- బాధితులను ఆదుకునేందుకు జేసీబీలో గంగపట్నం వెళ్ళిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే అంటే ఎలా ఉండాలో అక్షరాలా ఆచరించి చూపుతున్నారు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న. ప్రజలు కష్టాల్లో ఉంటే తానింట్లో హాయిగా కూర్చోవడం అన్నది ఆయనకెప్పుడూ లేదు. ఎంతటి కష్టమైనాసరే బాధితులను ఆదుకోవాలన్నదే ఆయన నైజం. ఒకవైపు భారీ వానలు, తుఫాన్ చలిగాలులు, ఎక్కడా చూసినా రోడ్లపై కూడా నీళ్ళ ప్రవాహాలు. అలాంటి సమయంలో సాధారణంగా చాలా మంది నాయకులు ఇళ్ళలోనే కూర్చుని అధికారులకు ఫోన్లలో ఆదేశాలిచ్చి తమ బాధ్యత అయిపోయిందని చేతులు దులుపుకుంటుండడం చూస్తుంటాం. కానీ ప్రసన్న మాత్రం ఒక్క గంట కూడా వృధా చేయకుండా, పలు గ్రామాల్లో వానల ధాటికి ఇళ్ళు మునిగి బాధలుపడుతున్న ప్రజలను స్వయంగా వెళ్ళి కలుసుకుని. వారికి తమ వంతు సేవలందించారు. గ్రామాల్లో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులను ఎప్పటి కప్పుడు పురమాయించారు. ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం గ్రామం జలదిగ్బంధనంతో ఉండడంతో అక్కడికి కూడా ఎలాగైనా సరే వెళ్ళాలని జేసీబీలో కూడా సాహసోపేతమైన రీతిలో ప్రయాణం సాగించి బాధిత ప్రజల వద్దకు వెళ్ళి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గత రెండుమూడు రోజులుగా భారీ వానల వల్ల కోవూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు అల్లకల్లోలమైపోవడంతో నాయకులు, కార్యకర్తలను, అధికారులను వెంటబెట్టుకుని ప్రసన్న ప్రతి ప్రాంతం తిరుగుతూ ఆపదల్లో ఉన్న ప్రజలకు రక్షణ కల్పిస్తూ, వారి తక్షణావసరాలను తీర్చేందుకు అప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేశారు.దారంతా నిండానీళ్ళు రావడంతో జేసీబీలో ఆయన ప్రయాణించారు. ఇలాంటి కష్టకాలంలో ఎమ్మెల్యే ప్రసన్న తమ వద్దకు వచ్చి ఈ కష్టకాలంలో ఓదార్చడం, తమకు కావాల్సిన వసతులు ఏర్పాటుచేయడం పట్ల బాధితులు ఆయనకు తమ కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

### కానిస్టేబుల్ కుటుంబానికి 2 లక్షల సాయం :

వరద వెల్లువలో చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తూ మరణించిన ఎన్‌డిఆర్ఎఫ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కుటుంబానికి నల్లపరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నుంచి రెండు లక్షల రూపాయల సాయాన్ని ప్రకటించి ఎమ్మెల్యే ప్రసన్న తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ వానలు వరదల వల్ల కోవూరు నియోజకవర్గంలోని ప్రజలు బాగా నష్టపోయారని, ఈ నష్టాలన్నిటిపై నివేదిక తయారు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పంపించి బాధితులకు సాయం చేయాల్సిందిగా కోరుతామని చెప్పారు. ఇందుకూరుపేట మండలంలోని నాలుగు గ్రామాలు పూర్తిగా మునకకు గురయ్యాయని, ఆక్వా రైతులకు భారీగా నష్టం జరిగిందని ఆయన తెలిపారు. అనేకమంది వైకాపా నాయకులు, కార్యకర్తలు ఎక్కడికక్కడ అప్రమత్తమై ప్రజలను ఆదుకునేందుకు తమవంతు కృషిచేశారని ఆయన చెప్పారు. గంగపట్నం వరదనీళ్ళలో చిక్కుకుపోయిన ఇద్దరు రైతులను స్థానిక నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి సహకారంతో బోటు పంపించి ఆదుకోవడం జరిగిందన్నారు. రైతులను కాపాడిన మత్స్యకారులకు ఆయన ఆర్థికసాయం చేయడమేకాక, ఎక్కడికి బోట్లు కావాలన్నా పంపి ఆదుకున్నారంటూ ప్రసన్న ఆయన్ను అభినందించారు. డిఎల్‌డిఏ ఛైర్మెన్ విజయ్‌కుమార్, మైపాడు శివాలయం కమిటీ ఛైర్మెన్ కనుపూరు సురేంద్రబాబు, ఎం.శ్రీనివాసులురెడ్డి, తహశీల్దార్ పద్మజ, ఎంపిడిఓ రఫీఖాన్, నాయకులు వెంకటశేషయ్య, షబ్బీర్, నరసింహులు, ప్రసాద్ పాల్గొన్నారు.

# వరద ధాటికి.. వందల ఏళ్ళ నాటి సోమేశ్వరాలయం ధ్వంసం

పెన్నానదికి వచ్చిన వరద నీటి ప్రవాహం శతాబ్దాల నాటి అపూర్వమైన కామాక్షిదేవి సమేత శ్రీ సోమేశ్వరాలయాన్ని ధ్వంసం చేసింది. అనంతసాగరం మండలంలోని సోమశిల జలాశయం చేరువలోనే ఈ ప్రాచీనమైన ఆలయం ఉంది. జలాశయం నిర్మాణ సమయంలో ఈ ఆలయానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంజనీర్లు అన్నివిధాలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఎంతో సుందరమైన ప్రకృతి వాతావరణంలో భక్తులను, పర్యాటకులను బాగా ఆకట్టుకుంటున్న ఈ ఆలయం ఈనెల 20వ తేదీన భారీగా వచ్చిన వరదనీటి విలయానికి కకావికలమైపోయింది. అల్లంత ఎత్తులో.. దూరాన్నుంచే కనువిందుగా కనిపించే ఆలయ గాలిగోపురం తునాతునకలైపోయింది. గర్భగుడి ఛిన్నాభిన్నమైంది. ఎక్కడ చూసినా బురదే! ఆలయ ప్రాంగణంలోని పెద్దపెద్ద రావి చెట్లు కూడా నేలకూలాయి. ఆలయమంతా పెన్నా ప్రవాహం నిండిపోవడంతో ఎంతో అమూల్యమైన ఆలయ కట్టడాలన్నీ కుప్పకూలిపోయాయి. అన్నపూర్ణాదేవి గర్భగుడి, నవగ్రహ మండపం, కల్యాణమండపం అన్నీ నీటమునిగి నేలమట్టమైపోయాయి. అమ్మవారి గర్భగుడి తలుపులు విరిగిపోయి చెట్ల మొదళ్ళలో



(ఆలయ గోపురం ఫైల్ ఫోటో)



ధ్వంసమైన గోపురం

చేరాయి. ఎక్కడ చూసినా బండలు, రాళ్ళ గుట్టలుగా ఆలయ అవశేషాలు భక్తులకు కన్నీరు పెట్టించాయి. ఆలయ ప్రహరీ అంతా పడిపోయింది. ఆలయం నీట మునిగి కూలిపోయిందనే సమాచారంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, భక్తులు తరలివచ్చి ముక్కలుగా మిగిలిన ఆలయాన్ని చూసి ఆవేదనకు గురయ్యారు.

### ప్రాచీనకాలం నాటి శివలింగం ప్రత్యక్షం



గుట్టలుగా పడిపోయిన రాళ్ళలో కొంత మంది భక్తులకు మరో కొత్త శివలింగం కనిపించడంతో భక్తులు ఆశ్చర్యంతో ఆ విషయాన్ని ఆలయ నిర్వాహకులకు తెలియజేశారు. పురాతన కాలం నాటి ఈ ఆలయంలో ఒకప్పుడు సోమేశ్వర లింగం ఉండేదని, కాలక్రమంలో అది కనుమరుగైపోయిందని తమ గురువులు చెప్పేవారని, తమ అదృష్టవశాత్తూ ఎప్పుడో కాలగర్భంలో కలిసిపోయిన ఆ శివలింగం ఇప్పుడు ఇలా బయటపడడం ఆశ్చర్యకరమని ఆలయ అర్చకుడు తెలిపారు. సోమేశ్వరాలయం జలమయమై నీట మునిగిపోయిందనే సమాచారం తెలుసుకున్న వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి తదితర ప్రముఖులంతా ఆలయాన్ని సందర్శించి, ఆలయం కుప్పకూలిపోయి ఉండడాన్ని చూసి ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ ఆలయాన్ని ప్రభుత్వం సహకారంతో పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

### వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

# వరద బాధితులకు ఆహారపొట్లాలు




గత మూడు దశాబ్దాలుగా అనేక సమాజసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నెల్లూరులోని వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ వారు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న వరద బాధితులకు ఆహార పొట్లాలు అందించి తమ సేవాభావం చాటుకున్నారు. గత వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల ఎంతోమంది నిరుపేదలు, అభాగ్యులు అన్నం లేక అగచాట్లు పడుతున్నారని ట్రస్ట్ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తూ తమ ప్రతినిధులతో ఈనెల 23న నెల్లూరులోని వెంకటేశ్వరపురం, కోవూరులోని పలు లోతట్టు ప్రాంతాల్లోని నిరుపేదలకు ఆహారపొట్లాలను అందజేశారు.




# రెండేళ్లకోసారి ఎన్నికలుంటే ఎంత బావుణ్ణు!

ఉత్తరాన ఉన్న కశ్మీర్ నుంచి దక్షిణాన ఉన్న కన్యాకుమారి వరకు విస్తరించి ఉన్న ఈ సువిశాల భారతదేశంలోని కోట్లాది మంది రైతులు ఆరుగాలం శ్రమించి పండించే పంటలు, వాటి ఉత్పత్తుల మార్కెటింగ్‌కు సంబంధించి రైతులు అయితే బాగా హ్యాండిల్ చేయలేరనే 'సదుద్దేశం'తో మొత్తం నియంత్రణను రిలయన్సు సామ్రాజ్యాధినేత ముఖేష్ అంబానీ, కొత్తగా ఓ వ్యాపార సామ్రాజ్యాన్ని గత ఏడేళ్లుగా సునాయాసంగా నిర్మించుకుంటూ వస్తున్న గౌతమ్ అదాని చేతుల్లో పెట్టడానికి ఓ ఏడాది క్రితం కేంద్రప్రభుత్వం చేత మూడు చట్టాలను ఆమోదింపచేసిన మన ప్రియతమ ప్రధానమంత్రి.. ఇప్పుడు ఆ చట్టాలను తొలగిస్తున్నట్టు ప్రకటించారు. రైతుల క్షేమం కోరి, ఎంతో ఉదాత్తమైన 'సుహృద్భావన'తో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు మోదీ సందర్భోచిత హావభావాలు, వాచికాభినయం, ఆహార్యంతో కూడిన అభిభాషణతో ప్రకటించారు. రైతులకే కాక, మొత్తం దేశానికే ఆయన క్షమాపణలు చెప్పారు. ఇన్ని కోట్లమందికి క్షమాపణలు చెప్పడానికి 56 అంగుళాల ఛాతి సరిపోదు. 65 అంగుళాల ఛాతి కావాలి

చిన్న, సన్నకారు రైతులకు లాభసాటి అయిన వ్యవసాయ చట్టాల విషయంలో రైతులలో ఒక వర్గం వారిని ఒప్పించలేకపోయామని ప్రధాని నొచ్చుకున్నారు. ప్రభుత్వ సదుద్దేశాలను అర్థం చేసుకోలేక ఈ చట్టాలను వారు వ్యతిరేకించడంతో, వారి అభిమతాన్ని గౌరవిస్తూ వాటిని తొలగిస్తున్నామని, రైతులంతా సంతోషంగా ఇళ్లకు వెళ్ళాలి అని ప్రధాని కోరారు.




చిత్రం! రైతులు ఉద్యమాన్ని విరమించలేదు. చట్టాలను ఉపసంహరించుకుంటున్నాం అని ప్రధాని చెప్పినంత మాత్రాన అవి అంతర్ధానమైపోవు అనేది వారి భావన కావచ్చు. లేదా మాట మీద మన గౌరవ ప్రధాని ఎంతసేపు నిలబడతారో అన్న అనుమానం కావచ్చు.

ఎంతో బరువెక్కిన హృదయంతో.... మన 130 కోట్లకు పైబడిన జనాభా ప్రతినిధిగా జాతిని ఉద్దేశించి ఆయన చేసిన 'క్షమాపణల' ప్రసంగంలో రైతులకు చిత్తశుద్ధి కనిపించలేదని ప్రతిపక్ష నాయకులు మాటల తూటాలతో విరుచుకుపడ్డారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్ ఎన్నికల భయంతో ప్రధాని వెనక్కుతగ్గారని దుయ్యబట్టారు. కేంద్రం ఒక ఎన్నికల నుంచి మరో ఎన్నికలే లక్ష్యంగా నడుస్తున్నది అని యశ్వంత్ సిన్హా వ్యాఖ్యానించారు. 700 మంది రైతుల బలిదానం చేయడానికి ముందే ప్రధాని ఈ నిర్ణయం తీసుకుని ఉండాల్సిందని కాబోయే కాంగ్రెస్ నాయకుడు వరుణ్‌గాంధీ కర్రు కాల్చి వాతపెట్టారు. అందుకే 'పార్లమెంటులో ప్రభుత్వం ఉపసంహరణ బిల్లులు ప్రవేశపెట్టాలి. ఎందుకు ఈ చట్టాలను ప్రభుత్వం ఉపసంహరించుకుంటున్నదో చెప్పాలి. ఆ మాత్రం దానికి ఆర్డినెన్సు రూపంలో ఈ చట్టాలను రైతుల పీకలకు ఎందుకు చుట్టారో చెప్పాలి. పార్లమెంట్ కళ్ళకు గంతలు కట్టి, ఎటువంటి చర్చ జరగడానికి అవకాశం లేకుండా... బిల్లులు పాస్ అయ్యాయనిపించి, ఒక స్టాంపు కూడా వేయించేసి చట్టాలు చేసేశాం... ఏం పీక్కుంటారో పీక్కోండి అన్నట్టుగా కేంద్ర ప్రభుత్వం ఏడాది కాలంగా రోడ్ల మీద ఉద్యమిస్తున్న రైతులను వారిమానాన వారిని ఎందుకు వదిలేసిందో చెప్పాలి. రైతుల మీద ఇప్పుడు హఠాత్తుగా ప్రేమ ఎందుకు పుట్టుకు వచ్చిందో చెప్పాలి. అప్పుడు గానీ, ఉద్యమం విరమించే విషయం ఆలోచించం' అని రైతు నాయకులు ప్రకటించారు.

అంటే ప్రధాని దేశ ప్రజలను ఉద్దేశించి గంభీరోదాత్తంగా నాటకీయంగా సందర్భోచిత పద విన్యాసంతో చేసిన ప్రకటనను రైతు నేతలు పూర్తి విశ్వాసంలోకి తీసుకోలేదు అనే భావం రైతు ఉద్యమ నేతల్లో తొంగిచూస్తోంది అని మనకు అనిపించడం సహజం. ఆయన మాటల్లో వారికి చిత్తశుద్ధి, రైతుల పట్ల ఆత్మీయత కనిపించలేదా? వజ్ర సంకల్పుడిగా..., భారతీయుల పుణ్యఫలంగా బీజేపీ నేతలు భక్తి ప్రపత్తులతో పడుతూ వస్తున్న హారతులను... అర్ధనిమీలిత నేత్రాలతో... ఎటువంటి హావభావాలను వ్యక్తం చేయని గాజు కళ్ళతో స్వీకరిస్తూ వస్తున్న మోదీ దేశ ప్రజల ముందు అంత 'ఓపెన్'గా చెప్పడం చాలా గొప్ప విషయం.

అయినా... ఆయన ఏమీ మొహమాట పడలేదు. సిగ్గుపడలేదు. మాటల కోసం తడబడలేదు. అందుకే, ఆయనను ఓ గొప్ప రాజనీతిజ్ఞుడుగా మన 'డబుల్ ప్రియతమ' హోంమంత్రి 'అమిత'షా అభివర్ణించారు.

అందరూ ఆడిపోసుకుంటున్నట్టుగా అంబానీ, అదానీ కంటే కూడా రైతులే ముఖ్యం. ఎందుకంటే రైతుల చేతిలో ఓట్లు ఉన్నాయ్. వారి కుటుంబాలు, కులాలు, మతాలు, ప్రాంతాల వారి చేతుల్లో ఓట్లు ఉన్నాయ్. నాయకులం అనుకునే వారి జాతకాలు వారి చేతుల్లో ఉన్నాయ్. ఈ ఓట్లన్నీ ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ శివార్లలో ఉన్నాయ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్ అసెంబ్లీలకు ఇంకో మూడు, నాలుగు నెలల్లో ఎన్నికలున్నాయ్. అక్కడ ఈ ఎన్నికల్లో బీజేపీ పళ్ళికిలించే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయ్. అలా జరిగితే, 2024 ఎన్నికలలో బీజేపీ...!?

అమ్మో! తలుచుకుంటుంటేనే వళ్లు జలదరిస్తునది. 'స్థిత ప్రజ్ఞత' అంటే ఇదే. మోదీకి విషయం అర్థమయింది. కార్పొరేట్ మిత్రుల దగ్గర వ్యాగన్ల కొద్దీ డబ్బు ఉంటుంది కానీ ఓట్లు ఉండవు కదా! ఓట్లు లేని డబ్బు.. వాసన లేని కాగితపు పువ్వు లాంటిది. 'కౌన్ బనేగా కరోర్పతి' అనే స్టార్ టీవీ ప్రోగ్రామ్ లేని అమితాబ్ బచ్చన్ లాంటిది. రామాలయం లేని అయోధ్య లాంటిది. ఒక్క ముక్కలో చెప్పాలి అంటే అమిత్‌షా లేని నరేంద్ర మోదీ లాంటిది.

అందుకే, ఓట్లను... డబ్బును కలిపేందుకు మోదీ ఇప్పుడో అడుగు వెనక్కి వేశారు. రైతాంగం పీకపై పెట్టిన కత్తిని వెనక్కు తీసుకున్నారు.

ఉత్తరప్రదేశ్, పంజాబ్ ఎన్నికలు అయ్యాక ఆ రెండింటిలోనూ బీజేపీ గెలవనిచ్చి ఆ ఊపుతో 2024 లోకసభ ఎన్నికల్లో గెలిచేస్తే మళ్ళీ అయిదేళ్ల వరకు ఏ రకమైన బాధితులకూ దిక్కూ మొక్కూ ఉండదు. అదే రైతుల భయం కూడా. అందుకే, పార్లమెంట్‌లో ఈ చట్టాల ఉపసంహరణకు ప్రభుత్వం ఎంచుకునే విధానం, బిల్లులలో వాడే భాష, భావం, ప్రభుత్వ వివరణ మొదలైనవి అన్నీ చూశాకే తమ ఆందోళన విరమించాలని రైతు నాయకులు నిర్ణయించారు. అంటే కేంద్ర ప్రభుత్వం విశ్వసనీయతపై రైతుల అభిప్రాయం ఇది.

ఇప్పుడు తెరమీదకు వస్తున్న కొత్త డిమాండ్లు బీజేపీని ఉక్కిరిబిక్కిరి చేయబోతున్నాయి. పౌర చట్టం, కశ్మీర్‌లో 370వ అధికరణం రద్దు ఉపసంహరణకు డిమాండ్లు ఊపందుకుంటున్నాయి.

అందుకే, ఎన్నికలు ఐదేళ్లకోసారి గాకుండా మూడేళ్లకోసారి వస్తే, ప్రభుత్వ వ్యవస్థలను చేజిక్కించుకున్న రాజకీయవాదులు తోకలు అదేపనిగా ఝాడించడానికి ఉండదు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ తమ గెలుపుకు కారణమైన వారిని అవమానించడానికే కొంత వెనకడుగు వేస్తారు. అయినవారికి దోచిపెట్టే 'వీర దోపిడీ'లో దూకుడు కొంత తగ్గుతుంది.

మరీ ఐదేళ్లకోసారి ఎన్నికలు అంటే ప్రజాస్వామ్యం అనే 'పరమ సాధ్వి' కురు సభలో ద్రౌపది అయిపోతుంది. కౌరవల్లాంటి రాజకీయ వ్యాపారులు ప్రజాస్వామ్యాన్ని చెరబడుతుంటే బలాఢ్యులైన పాండవుల్లాంటి ఓటర్లు కళ్ళనీళ్లు కుక్కుకుంటూ అయిదేళ్ల తరువాత వచ్చే ఎన్నికల కోసం ఎదురు చూడడం తప్ప చేయగలిగింది ఏమీ లేదు.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

## ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద..ఉచితంగా సిలిండర్లు, స్టౌలు

ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఈనెల 20న నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని 75 మంది పేద కుటుంబాలకు చెందిన మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, స్టౌలు పంపిణీచేశారు. బిజెపి స్టోన్‌హౌస్‌పేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ పంపిణీ జరిగింది. బిజెపి రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయులురెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఉజ్వల పథకం కింద తొలి విడతగా దేశంలో 8 కోట్ల మందికి గ్యాస్‌కనెక్షన్లు ఇచ్చారని, ఇప్పుడు రెండో విడతలో సిలిండర్, స్టౌ, రెగ్యులేటర్‌లు ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు, మండల బిజెపి అధ్యక్షుడు ఆదినారాయణ పాల్గొన్నారు.



# గూడూరు డివిజన్ వార్తలు



## దాతల సేవలు అభినందనీయం

**ఆర్డీవో మురళీకృష్ణ**

రోటరీ క్లబ్ ద్వారా దాతలు చేస్తున్న సేవలు అభినందనీయమని గూడూరు ఆర్డీఓ మురళీకృష్ణ తెలిపారు. రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల పురపాలక సిబ్బంది 200 మందికి దుస్తులు పంపిణీ చేసి, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆర్‌వో ప్లాంటును ప్రారంభించారు. చెన్నైలోని తెలుగువారి ప్రతినిధి డాక్టర్ సి.ఎం.కె.రెడ్డి సతీమణి సి.నిర్మలమ్మ, వారి తల్లి చిట్టమూరు అనసూయమ్మ జ్ఞాపకార్థం ఈ రెండు కార్యక్రమాలకి దాతృత్వం వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్డీఓ మురళీకృష్ణ పాల్గొనగా డాక్టర్ సి.ఎం.కె.రెడ్డి, సి.నిర్మలమ్మ, మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, క్లబ్ అధ్యక్షులు బాలకృష్ణంరాజు, కార్యదర్శి సురేష్‌రెడ్డి, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ పి.రామకృష్ణారెడ్డి, కె.మునిగిరీష్ ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షులు ఎన్.లక్ష్మీకుమారి, సెక్రటరి అనిత తదితరులు పాల్గొన్నారు.



## పేద బ్రాహ్మణులకు పేర్నాటి దాతృత్వం



పేర్నాటి విజయభాస్కర్‌రెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని వారి సతీమణి విరజ, కుటుంబసభ్యుల దాతృత్వంతో ఇటీవల 40మంది పేద బ్రాహ్మణులకు బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే క్యాన్సర్‌తో బాధపడుతున్న వెంకటరాంబాబుకు చికిత్స కోసం రూ.10వేలు, బ్రెయిన్ హ్యూమర్‌తో బాధపడుతున్న రాజగోపాల్ భార్య చికిత్స నిమిత్తం రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, పేర్నాటి కుటుంబసభ్యులు అమరనాథ్‌రెడ్డి, వీణ, విరజ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## స్టేడియంలో వరినాట్లు వేసిన క్రీడాకారులు



గూడూరు ప్రభుత్వ స్టేడియం చెరువును తలపిస్తుండడంతో క్రీడాకారులు వరినాట్లు వేసి తమ నిరసన తెలిపారు. వై.కా.పా నాయకుడు, క్రీడాకారుడు ఉలవకాయల ప్రసాద్ మాట్లాడుతూ అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులాగ తయారైందని, అంతేగాక దీపావళికి స్టేడియంలో టపాసుల అంగళ్ళకి అనుమతినివ్వడంతో వాహనాల రాకపోకలతో స్టేడియం మొత్తం గతుకుల మయమై దారుణంగ తయారై హాకీ, క్రికెట్, ఫుట్‌బాల్ క్రీడాకారులకే కాక, రోజు వందలమంది వాకింగ్ చేసే వారికి చాలా ఇబ్బందిగ మారిందని, ప్రభుత్వ ఆసుపత్రి నుండి స్టేడియంలోకి నీళ్ళు వస్తుండడంతో వాటిని అరికట్టాలని అన్నారు. అధికారులు టపాసుల అంగళ్ళ వారికి స్టేడియం కాకుండా ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమళ్ళ రమేష్, వెంకి, అశ్విన్, మొబైల్ రాజా, సందీప్, శివ, క్రీడాకారులు పాల్గొన్నారు.



# కావలిలో.. అమరావతి రైతులకు బ్రహ్మరథం

## కదిలొచ్చిన ప్రజలు..పెద్దసంఖ్యలో పాల్గొన్న బిజెపి నేతలు

కావలిలో ఈనెల 21న అమరావతి రైతుల పాదయాత్ర పెద్దఎత్తున జరిగింది. 'న్యాయస్థానం నుంచి దేవస్థానం దాకా' అనే నినాదంతో బయలుదేరిన ఈ పాదయాత్రకు కావలిలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పాదయాత్ర నెల్లూరుజిల్లాలోని కావలి-పెద్దపవని రోడ్డులోని కొమ్మి క్రాస్‌రోడ్డుకు చేరుకునేసరికి ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లోని ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి పాదయాత్రకు స్వాగతం పలికారు. టిడిపి, అఖిలపక్ష నాయకులు, బిజెపి వాళ్ళు కేంద్ర, రాష్ట్రనాయకులు, స్థానికంగా ఉండే నాయకులు అందరూ వచ్చి పాదయాత్రతో కలిశారు. దీంతో అమరావతి మహిళలకు బొట్లు పెట్టి చీరసారె అందజేశారు. బిజెపి నాయకులు సోము వీర్రాజు, దగ్గుపాటి పురంధేశ్వరి, సుజనా చౌదరి, కన్నా లక్ష్మీనారాయణ, భరత్‌కుమార్, కందుకూరి సత్యనారాయణ,టిడిపి నాయకులు బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్, బొల్లినేని రామారావు, మాలేపాటి సుబ్బా నాయుడు, ఎమ్మెల్సీ వాకాటి, కందుకూరు మాజీ ఎమ్మెల్యే గ్రంధి యానాదిశెట్టి, పోతుగంటి అలేఖ్య, పొన్నగంటి రవీంద్రనాథ్, కావలిలో వామపక్షాల నాయకులు దామా అంకయ్య, దేగా సత్యం, పి. పెంచలయ్య, కె.భాస్కర్, జనసేన నాయకులు వెంకటసుబ్బయ్య, సాయి, వెంకటేశ్వర్లుతో పాటు మన్నవ విజయలక్ష్మి, మలిశెట్టి విజయలక్ష్మి, మల్లిక, రమాదేవి తదితర మహిళా నాయకులంతా పెద్దసంఖ్యలో మహిళలతో తరలివచ్చి పాదయాత్రతో కలసి నడిచారు. అమరావతి రైతుల పాదయాత్రలో తప్పనిసరిగా పాల్గొనాలంటూ ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బిజెపి నాయకులకు చెప్పడంతో ఈ పాదయాత్రలో పలువురు బిజెపి కేంద్రనాయకులు, రాష్ట్ర, జిల్లా నాయకులు వచ్చి పాల్గొన్నారు. దీంతో అమరావతి రైతుల్లో సంతోషం వెల్లివిరిసింది. ప్రతి గ్రామం నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు వచ్చి రైతుల పాదయాత్రకు సంఘీభావం పలికారు. బిజెపి నాయకుడు కామినేని శ్రీనివాసులు 20 లక్షలు, టిడిపి నాయకుడు బొల్లినేని వెంకటరామారావు 30 లక్షలు, కందుకూరి వెంకటసత్యనారాయణ 66వేలు ఇలా పలువురు నాయకులు పాదయాత్రకు విరాళాలను అందజేశారు.



### తాళమ్మ అమ్మవారికి..

# ప్రత్యేక పూజలు



గూడూరు సమీపంలో కొలువై ఉన్న తాళమ్మ అమ్మవారికి ఈనెల 21న ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువనే అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అష్టోత్తర నామాలు, కుంకుమార్చనలతో పూజించారు. అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి విశేష సేవలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

### నీలకంఠేశ్వరాలయంలో

# రుద్రాభిషేకాలు

నాయుడుపేటలో స్వర్ణముఖి నది ఒడ్డున వెలసివున్న జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీ నీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈనెల 21న మహాదేవునికి విశేషపూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. వేదపండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మహాశివునికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ఆ తర్వాత ఆలయంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నృసింహస్వామికి కన్నుల పండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు వనభోజనాలు పెట్టారు. మాజీ నుడా డైరెక్టర్, నీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త గూడూరు రఘునాథరెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ అర్చకులు గణేష్‌శర్మతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

### చెంగాళమ్మ అమ్మవారిని దర్శించుకున్న..

# డిఆర్‌డిఓ ఛైర్మెన్ మన సతీష్‌రెడ్డి



సూళ్లూరుపేటలో కొలువై వున్న చల్లనితల్లి శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారిని ఈనెల 21న డిఆర్‌డిఓ ఛైర్మెన్ మన నెల్లూరీయుడు డా.సతీష్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ఛైర్మెన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఇ.ఓ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి తదితరులు సతీష్‌రెడ్డికి స్వాగతం పలికి అమ్మవారి వద్ద పూజలు చేయించారు. ఆలయ అర్చకులు ఆయన్ను ఆశీర్వదించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు గోగుల తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

# భారీవానల బాధితులకు.. రెడ్‌క్రాస్ చేయూత



గత కొద్ది రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీవానలతో నెల్లూరులోని లోతట్టు ప్రాంతాల ప్రజలు నిరాశ్రయులై బాధలుపడుతున్న తరుణంలో నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ పునరావాస కేంద్రాల్లో ఉన్న దాదాపు అయిదువందల మందికి భోజన వసతులు కల్పించి తనవంతు సేవలందించింది. ముఖ్యంగా నగరంలోని వెంకటేశ్వరపురం ప్రాంతంలో ఉన్న భగత్‌సింగ్‌కాలనీ, గాంధీగిరిజన కాలనీల్లో నీట మునిగిన ఇళ్ళలోని వారిని ఆదుకుంటూ వారికి అన్నం ప్యాకెట్లు, నీళ్ళ ప్యాకెట్లు అందజేసింది. వానలు, వరదల ధాటికి రైళ్ళు కూడా నిలచిపోవడంతో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణీకులకు కూడా అన్నం, నీళ్ళ ప్యాకెట్లను అందించామని, కోవూరు ప్రాంతంలో కూడా బాధితులకు వాటర్‌ప్యాకెట్లు అందజేశామని, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదేశాల మేరకు బాధితులందరికీ ఈ సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. విపత్కర సమయాల్లో ప్రజలకు రెడ్‌క్రాస్ తన సేవలందిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ శ్రీరంజని, ఉదయశంకర్, కార్యదర్శి పి. మస్తానయ్యతో పాటు రెడ్‌క్రాస్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

# ఆరు శతాబ్దాల నాటి..'నవాబుపేట' శివాలయం

**'శివం కరోతీతి శివ:' అంటున్నాయి వేదాలు. శివం అంటే శుభం అని అర్థం. సకల శుభాలను కలిగించే దేవాదిదేవుడు శివుడేనన్నది తెలుసుకోవాల్సిన పరమార్థం. మన ప్రాచీనమైన వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు అన్నీ ఆ మహాదేవుని లీలావైభవాన్ని ఎంతో ఘనంగా చాటుతూ ఆ సదాశివుని సదా పూజిస్తే సకల కష్టాలు తీరిపోయి, సర్వశుభాలు కలుగుతాయని స్పష్టం చేస్తున్నాయి. అనేకరూపాలతో, అనేక పేర్లతో ఆ పరమేశ్వరుడు అంతటా కొలువై ఉన్నాడు. నెల్లూరు జిల్లాలోనూ ఎన్నో పురాతన శివాలయాలున్నాయి. అందులో పేరెన్నికగన్న దేవాలయం..నెల్లూరు నగరానికి ఈశాన్యం వైపున ఉన్న నవాబుపేటలో కొలువై ఉన్న భ్రమరాంబా దేవి సమేత శ్రీ మల్లీశ్వర దేవాలయం. ఈ దేవాలయం ఎంతో పురాతనమైనది. ఈ ఆలయ చరిత్ర.. ప్రాశస్త్యం, స్థానిక కథనాలు ఎంతో ఆసక్తికరమైనవి.**

### ఆలయ చరిత్ర :

నెల్లూరు నగరంలో శివాలయం అనగానే రెండు ప్రధానమైన ఆలయాలు అందరికీ గుర్తుకువస్తాయి. ఒకటి మూలాపేటలోని అత్యంత ప్రాచీనమైన భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయం. నెల్లూరు పుట్టకమునుపే ఇక్కడ మూలస్థానేశ్వరుడు స్వయంభువుగా వెలిశాడని, నెల్లిచెట్టు (ఉసిరిక) కింద వెలసిన శివుడు కనుక ఈ ఊరికి కూడా నెల్లివూరు..అని పేరు వచ్చిందని, అదే 'నెల్లూరు'గా కూడా మారిందని అంటారు. ఇక రెండవ ఆలయం..ఎంతో పురాతనమైన శివాలయం.. అదే నవాబుపేటలోని భ్రమరాంబాదేవి సమేత శ్రీ మల్లీశ్వరాలయం. ఈ ఆలయం ఎవరు నిర్మించారనేది ఇదమిద్ధంగా తెలియకపోయినా దాదాపు ఆరువందల సంవత్సరాల నాటి దేవాలయంగా పురాతత్వశాస్త్ర వేత్తల అభిప్రాయం. కొంతకాలం క్రితం ఈ పురాతన ఆలయంలోని ధ్వజస్తంభం శిథిలం కాగా, దాని స్థానంలో కొత్తది








నిర్మించాలని దానిని తొలగించగా ఆ ధ్వజస్తంభం కింద కనిపించిన నాణేలను బట్టి, ఈ ఆలయం అరువందల ఏళ్ళనాటిదని నిర్ధారించారు. ప్రాచీనగ్రంథాల్లో కూడా ఈ ఆలయం ప్రస్తావనలు ఉన్నట్లు తెలుస్తోందది.

### భక్తవరదుడు..మల్లీశ్వరుడు :

మల్లీశ్వరుడు భక్తవరదుడని, భక్తుల కష్టాలు తీర్చి, కోరిన కోర్కెలు నెరవేర్చి సకల శుభాలు కలిగిస్తాడని ప్రతీతి. అందుకే ఈ ప్రాంతప్రజలంతా మల్లీశ్వరుని తమ ఇష్టదైవంగా కొలుచుకుంటూ ఉంటారు. ఈ ఆలయాన్ని అప్పట్లో సువిశాలమైన స్థలంలో అత్యంత సుందరంగా నిర్మించారు. కాలక్రమంలో కొంతభాగం శిథిలావస్తకు చేరినా, కొంతకాలం క్రితం ఆలయ నిర్వాహకులు జీర్ణోద్ధరణ గావించి సుందరంగా తీర్చిదిద్దారు. నూతన ధ్వజ స్తంభాన్ని నెలకొల్పి కుంభాభిషేకాలు చేసి ప్రభుత్వ సహకారంతో ఈ ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కూడా ఉన్నారు. నగరంలో ఉన్న ఈ ఆలయ ప్రాంతమంతా ఇప్పుడు ఎప్పుడూ జనం రద్దీతో కిటకిటలాడుతూ ఉంటుంది. ఎత్తయిన పురాతన గోపురం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటూ ఉంటుంది. గర్భాలయంలో మల్లీశ్వరుడు శివలింగ రూపధారియై ఉంటాడు... చెంతనే కరుణామయి భ్రమరాంబాదేవి అమ్మవారు కొలువై ఉంటారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యేశ్వరుడు, కాలభైరవుడు, దక్షిణామూర్తి తదితర పరివార దేవతలతో పాటు, ఇక్కడున్న రావిచెట్టు కింద ప్రతిష్టించిన నాగశిలలకు భక్తులు నిత్యం ప్రదక్షిణలు చేసుకుని మొక్కులు మొక్కుకుంటూ ఉంటారు. ఆలయ అర్చకులు మల్లీశ్వర స్వామికి అభిషేక సేవలు, నిత్యపూజలతో పాటు అమ్మవారికి కుంకుమపూజలతో పాటు పరివార దేవతలకు విశేష సందర్భాల్లో విశిష్టపూజలు, సేవలు చేస్తుంటారు.

### కార్తీకమాసంలో కళకళ :

కార్తీకమాసంలో ఈ ఆలయం భక్తుల రాకపోకలతో, కార్తీకదీపాలతో కళకళలాడుతూ ఉంటుంది. కార్తీక నక్షత్రం రోజున స్వామివారికి అర్చకులు అన్నాభిషేకాన్ని విశేషంగా నిర్వహిస్తుంటారు. మహాశివరాత్రి పర్వదినం రోజుల్లో రుద్రాభిషేకాలు, లింగోద్భవకాలంలో అన్నాభిషేకం నిర్వహిస్తారు. చైత్రమాసంలో శ్రీరామనవమి మరుసటిరోజు నుంచి శ్రీ మల్లీశ్వరస్వామికి పదిరోజుల పాటు వైభవోపేతంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఆలయ నిర్వాహకులు, దేవాదాయశాఖవారు, ధర్మకర్తలు, భక్తబృందాలవారు, స్థానిక ప్రజలు అందరూ కలసి అంగరంగవైభవంగా చేపట్టే ఈ బ్రహ్మోత్సవాలకు నెల్లూరు నగరప్రజలతో పాటు చుట్టుపక్కల ఉన్న అనేక ప్రాంతాల ప్రజలు కూడా వచ్చి స్వామివార్లను దర్శించుకుని తరిస్తుంటారు.

## కల్యాణ వైభవం...!



సూళ్లూరుపేట వాస్తవ్యుడు, హైదరాబాదు స్థిర నివాసి నెల్లూరు మధుసూదనరావు - (కీ.శే) వాణిల కుమార్తె మన్విత - మనికర్‌ల కల్యాణం నవంబర్ 21వ తేదీ హైదరాబాద్‌లో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

### ముందు జాగ్రత్తలు తీసుకుని ఉంటే..

# ముంపు ముప్పు ఉండేది కాదు



మాజీమంత్రి సోమిరెడ్డి

సోమశిల నుంచి 5.40 లక్షల క్యూసెక్కుల నీళ్ళు విడుదలైనప్పటికీ, ముందస్తు జాగ్రత్తలు తీసుకునివుంటే గ్రామాలకు ఎలాంటి ముప్పు వాటిల్లివుండేది కాదని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఒక్క ఇందుకూరుపేటలోనే 3వేల కోట్ల నష్టం జరిగిందని, జిల్లావ్యాప్తంగా ప్రజలు ఇంకా భారీగా నష్టపోయి ఉంటారని చెప్పారు. ఈనెల 24న నెల్లూరు సమీపంలోని అల్లీపురం వద్ద తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడంలో వైకాపా ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఇల్లు మునిగితే కడపలో 5800, నెల్లూరులో 2వేలు ఇవ్వడం దారుణమన్నారు. 75 టిఎంసిల సోమశిల డ్యాం ఆప్రాన్ మరమ్మతులకు 115 కోట్లకు అనుమతులిచ్చేందుకు కూడా దిక్కులేదని ఆయన ధ్వజమెత్తారు. ప్రజల ప్రాణాలు తీసే హక్కు ప్రభుత్వాలకు లేదని, ఇప్పటికైనా టెండర్లు పిలిచి వెంటనే పనులు చేపట్టాలన్నారు. పొర్లుకట్టలను తక్షణం మరమ్మతులు చేయించాలని, ఇసుక వ్యాపారం కోసం పొర్లుకట్టల జోలికెళ్ళేవారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బీదా రవిచంద్ర, కొండెపి ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి, మాజీ ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, దామచర్ల సత్య తదితరులు పాల్గొన్నారు.

# బాబు ఏడుపు.. పార్టీకి చెడుపు

(మొదటి పేజీ తరువాయి)

తనను తాను నాయకుడిగా కూడా రుజువు చేసుకోలేదు. అసెంబ్లీలో తన కుటుంబ సభ్యుల ప్రస్తావన తెచ్చి అవమానించారంటూ ఆరోపణ చేశారు చంద్రబాబు. మళ్ళీ తాను ముఖ్యమంత్రిగానే సభలో అడుగుపెడతానని శపథం చేసి సభ నుండి బయటకు వచ్చేశారు. అంతవరకూ బాగానే ఉంది. ఆయనలోని నాయకత్వపు లక్షణానికి, ఆయనలో ఉన్న పట్టుదలకి ఈ సవాలు అద్దం పడుతుంది. ఆ తరువాత ఆయన చేసిన పని ఆయనతో పాటు ఆయన క్యాడర్‌ను కూడా నవ్వులపాలు చేసింది. ఇంతటి వయసు, వయసుతో పాటు అనుభవం ఉన్న వ్యక్తి ఏడ్చిన ఏడుపుతో ఆయనపై ఎవరికీ జాలి కలగకపోగా ఇతర పార్టీల వాళ్ళు నవ్వుకుంటే ఆయన పార్టీ వాళ్ళు నవ్వులపాలయ్యారు. ఇక మీ నాయకుడి పని అయిపోయిందని అవతల పార్టీ వాళ్ళు ఆవహేళన చేస్తుంటే సిగ్గుతో చచ్చిపోతున్నారు.

రాజకీయాలలో గెలుపోటములు సహజం. ఆరోపణలు ప్రత్యారోపణలు కూడా అంతే సహజం. ఓడిపోయినప్పుడు సహనంతో వ్యవహరించి, ప్రత్యర్థుల ఆరోపణలను సంయమనంతో త్రిప్పికొట్టినప్పుడే నాయకుడి సమర్థత, సామర్థ్యం తెలుస్తుంది. ఇలా సహనం, సంయమనం రెండూ కోల్పోయి ఒక మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నాయకుడు, ప్రాంతీయ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఇలా ఏడవడం బహుశా దేశ రాజకీయాల్లోనే ఇదే ప్రథమం కావొచ్చు. ఆయన ఏడుపు ఆయన పార్టీకి ఖచ్చితంగా చెడుపే.

### నాటి పాపం... నేడు శాపమయ్యింది...

1994లో మళ్ళీ తమ పార్టీని అధికారంలోకి తేవడం కోసం అప్పట్లో రాత్రింబవళ్లు కష్టపడ్డారు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు. ఏడాది తిరిగేలోపే ఆయనను దించేసి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నారు చంద్రబాబు. పిలిచి పిల్లనిచ్చి పెత్తనమిచ్చిన మామకి వెన్నుపోటు పొడవడమే కాకుండా ఆయనపై వైస్రాయ్ హోటల్ సాక్షిగా చెప్పులు కూడా వేయించారు. లక్ష్మీపార్వతిని బూచిగా చూపించి రామారావు కుటుంబాన్ని మొత్తం ఆయనకు దూరం చేశారు. రామారావు లక్ష్మీపార్వతిల కన్నీళ్లకు కారణమయ్యారు. ఆ పాపమే ఇప్పుడు బాబుకు శాపమయ్యింది. క్రమేణా ఆయన గ్రాఫ్ పడిపోతూ వచ్చింది, ఇప్పుడు ఈ ఏడుపుతో ఆయన రాజకీయ ప్రస్థానం పరిసమాప్తమైంది.

### ఒక్కటైన నందమూరి కుటుంబం...

బాబు ఆచరిస్తున్న అర్థరహిత విధానాల వల్ల తమ కుటుంబ సభ్యుల పరువు బజారున పడడంతో పాటు తమ నాన్న స్థాపించిన పార్టీ కూడా భూస్థాపితం అవుతుందని ఇన్నాళ్లకు నందమూరి కుటుంబం గ్రహించినట్లుంది. బాలయ్యతో సహా నందమూరి కుటుంబమంతా మీడియా ముందుకొచ్చి మాట్లాడారు. జూనియర్ ఎన్టీఆర్ చేత వేరుగా నేరుగా మాట్లాడించారు. ఒక దశలో మాకిక ఏ విషయంలోనూ చంద్రబాబు అనుమతి కూడా అక్కర లేదని బాలకృష్ణ మాట్లాడడం అందరినీ ఆశ్చర్యపరచింది. తమ పార్టీని బ్రతికించుకోవడం కోసం వీళ్లంతా ఒక్కటై బాబుని ఇంటికి పంపిస్తారా అన్న అనుమానం సామాన్యుడికి సైతం కలిగింది. అదే జరిగితే తెలుగుదేశానికి మళ్ళీ మంచి రోజులొస్తాయన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. బాబు లేని దేశంకే మళ్ళీ భవిష్యత్తు ఉంటుందన్నది వారి నమ్మకం. బహుశా తెలుగుదేశంతో చేతులు కలపాలనుకుంటున్న జనసేన, కమలం ఆలోచన కూడా ఇదే కావొచ్చు. పార్టీపై ప్రజలలో వున్న అభిమానం, పార్టీ కార్యకర్తలలో ఉన్న ఉత్సాహం వంటివన్నీ బాబు నాయకత్వంతో నీరుగారిపోతున్నాయన్నది విభిన్న వర్గాలనుండి వినిపిస్తోందని కూడా వారు చెప్తున్నారు. నిజంగా నందమూరి కుటుంబం బాబుని పక్కనపెట్టి కొత్త నాయకత్వాన్ని తెరపైకి తెస్తే అది తెలుగుదేశానికి మంచిదే, లేదంటే బాబు ఏడుపు ఆ పార్టీకి చెడుపే.

### బాధితులకు

# కంటితుడుపు సాయం

**- బిజెపి విమర్శ**

వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది కేవలం కంటితుడుపు సాయంగానే ఉంటోందని, రూ.2 వేలు నష్టపరిహారమిచ్చి చేతులు దులుపు కుంటోందని బిజెపి నాయకులు ధ్వజమెత్తారు. విడవలూరు మండలంలో వరదముంపుకు గురైన ఊటుకూరులోను, పలు గిరిజన ప్రాంతాల్లోనూ బిజెపి నాయకులు భరత్‌కుమార్, కనపర్తి నాగేంద్ర, రమణతేజ, రమేష్, విజయలక్ష్మి, రాజేశ్వరి, జనార్ధన్ తదితరులు ఈనెల 24న పర్యటించి వరదబాధితుల గోడు ఆలకించారు. బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

### మూలస్థానేశ్వరునికి..

# విశేషంగా అన్నాభిషేకం



కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు మూలాపేటలో ఉన్న భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఆలయ అర్చకులు విశేషపూజలు, సేవలు చేస్తున్నారు. ఈనెల 24న స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. విశేషమైన రీతిలో స్వామివారికి అన్నాభిషేకం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. శివభక్తులు వెంకటశివయ్య, లక్ష్మీసింధూర, శశాంక్ ఈ పూజలకు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

### వ్యాధులు ప్రబలకుండా..

# వైద్యశిబిరాలు

ఇటీవల కురిసిన వానలు, వచ్చిన వరదలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లావ్యాప్తంగా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి తెలిపారు. ప్రజలు ఈ వైద్యశిబిరాలను సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

# చిరస్మరణీయుడు.. వెన్నెలకంటి రాఘవయ్య

ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధుడు, ఆదివాసీ, యానాదులు, గిరిజనులు తదితర అట్టడుగు వర్గాల అభ్యున్నతి ధ్యేయంగా జీవితమంతా పోరాడిన మహనీయుడు వెన్నెలకంటి రాఘవయ్య చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. ఈనెల 24న పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య 40వ వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరులోని యానాదులు, గిరిజనుల సంఘం నాయకులు ఆయన సేవలను స్మరించుకుని నివాళులర్పించారు. నెల్లూరులోని గిరిజన భవన్‌కు వెన్నెలకంటి రాఘవయ్య పేరుపెట్టాలని కోరారు. తొలుత వారంతా రాఘవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసి పెంచలయ్య, జిల్లా అధ్యక్షుడు బివిఎల్ శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇండ్ల రవి, ఉష, లక్ష్మి, కోటేశ్వరమ్మ, సుబ్రహ్మణ్యం, ఆదిమజాతి సేవక్ సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆదాల కుటుంబ పెద్ద దిక్కు

# సుశీలమ్మ ఇక లేరు



జిల్లావాసులకు సుపరిచితులైన ఆదాల కుటుంబం పెద్దదిక్కు ఆదాల సుశీలమ్మ నవంబర్ 24వ తేదీ బుధ వారం ఉదయం తమ 95వ ఏట తుది శ్వాస విడిచారు. ఆమె గత కొన్ని సంవ త్సరాలుగా హైదరాబాదులో తమ చిన్న కుమారుడు ఆదాల మురళీకృష్ణారెడ్డితో ఆయన వ్యవసాయక్షేత్రంలో ఉంటు న్నారు. అల్లూరు మండలం, నార్త్ మోపూరు సుశీలమ్మ స్వగ్రామం.

ఆమె భర్త శంకరరెడ్డి మూడు సంవత్సరాల క్రితం పరమపదించారు. సుశీలమ్మకు 5 మంది సంతానం. ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మొదటి సంతానం శ్యామలమ్మ గునుపాటి హరిశ్చంద్రారెడ్డి సతీమణి. హరిశ్చంద్రారెడ్డి కూడా గత ఏడాది కన్ను మూశారు. రెండవ సంతానం రాఘవరెడ్డి ప్రముఖ కాంట్రాక్టర్‌గా ప్రసిద్ధి. ఆయన కూడా అనారోగ్యంతో నాలుగేళ్ళనాడు దివంగతులయ్యారు. మూడవ సంతానం ప్రభాకర్‌రెడ్డి సీనియర్ రాజకీయవేత్తగా, మాజీమంత్రిగా నెల్లూరుజిల్లా రాజకీయాలలో కీలకపాత్ర వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పార్లమెంటు సభ్యునిగా నెల్లూరు నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నాలుగవ సంతానం జలజ నెల్లూరుజిల్లా కనుపర్తిపాడుకు చెందిన డాక్టర్ బిరుదవోలు దయాకర్‌రెడ్డి సతీమణి. 5వ సంతానం ఆదాల మురళీకృష్ణారెడ్డి కాంట్రాక్టర్‌గా, బిల్డర్‌గా ప్రసిద్ధి చెంది 'మాక్ ప్రాజెక్ట్స్, హోటల్స్' సారధిగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

ఆధునిక భావాలు కలిగిన వ్యక్తిత్వం సుశీలమ్మది. తమ బిడ్డలు బాగా చదువుకోవాలి, వ్యాపారాలు చేసి రాణించాలి, పదిమందిలో గౌరవంగా బ్రతకాలి, ఇతరులకు సాయం చేయాలన్నది ఆమెకోరిక. ఆమె ఆలోచనల ప్రకారమే ఆమె కుమారులందరూ ఉన్నత స్థాయికి ఎదిగి స్థిరపడ్డారు. అడిగినవాళ్ళకు లేదనకుండా సాయం అందించడం ఆమె నైజం. ఆమె చదువుకుంది తక్కువ అయినా లోకపరిజ్ఞానంలో ఆమె దిట్ట. టీవీలు కంప్యూటర్లు, ఇంటర్నెట్లు లేని రోజుల్లోనే భవిష్యత్ ప్రపంచాన్ని ఊహించగలిగిన మహామేధావి మా అమ్మ అని మురళీకృష్ణారెడ్డి పలు సందర్భాల్లో తమ అమ్మ గురించి చెప్పడం గమనార్హం. తన బిడ్డలందరినీ ఉన్నతశ్రేణిలో తీర్చిదిద్దిన ఆదర్శమూర్తి సుశీలమ్మ.

జక్కా సోదరులు జె.కె.రెడ్డి, జె.ఎస్.రెడ్డి, శివనారాయణరెడ్డిల మాతృమూర్తి కామేశ్వరమ్మకు సుశీలమ్మ స్వయానా సోదరి. సుశీలమ్మ మృతితో దుఃఖసాగరంలో ఉన్న ఆదాల, జక్కా కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.


# ఊళ్ళంతా నీళ్లు.. ఇళ్లల్లో కన్నీళ్ళు



- 40 ఏళ్లలో ఎప్పుడూ చూడని వరద బీభత్సం
- ఉగ్రరూపం దాల్చిన పెన్నమ్మ
- జిల్లావ్యాప్తంగా భారీవర్షాలు
- ఎన్నో కష్టాలు.. మరెన్నో నష్టాలు

***జిల్లాకు ఇటీవలి కాలంలో ఎప్పుడూ లేనంత కష్టం వచ్చింది. గత నలభై ఏళ్లలో కనీవినీ ఎరుగని విధంగా భారీవర్షాలు, వరదలతో జిల్లా అతలాకుతలమైంది. ఇళ్ళు వాకిళ్ళు మునిగిపోయాయి. వేలాదిమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వేలాది ఎకరాల్లో పంటపొలాలు నీటమునిగాయి. నదులు, వాగులు వంకలు పొంగిపొర్లాయి. చెరువులన్నీ నిండిపోయాయి. రోడ్లు, వంతెనలు దారుణంగా దెబ్బతిన్నాయి. పెన్నానది ఉగ్రరూపం దాల్చడంతో పెన్నానదీ పరీవాహకప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకుపోయాయి. సోమశిల జలాశయం నుంచి భారీగా వరదనీరు ముంచుకురావడంతో పక్కనే ఉన్న బృహత్తరమైన సోమేశ్వరాలయం పూర్తిగా ధ్వంసమైపోయింది. వరద బాధితులను రక్షించే క్రమంలో ఒక కానిస్టేబుల్ అసువులు బాశారు. ఈ జలవిలయంతో జిల్లా అల్లకల్లోలమైపోయింది. ప్రజలు వరద కష్టాలతో అల్లాడిపోయారు.***

అల్పపీడనాలు, వాయుగుండాల ప్రభావంతో గత వారం పదిరోజులుగా జిల్లాలో భారీవర్షాలు కురవడంతో జిల్లా అల్లకల్లోమైంది. పక్కనే ఉన్న వైఎస్సార్ కడపజిల్లా తదితర పైతట్టు ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి భారీగా వరదనీటి ప్రవాహం రావడంతో గత గురువారం (ఈనెల 18వ తేది) నుంచి సోమశిల డ్యామ్‌కు వరదప్రవాహం పెరుగుతూ వచ్చింది. అది క్రమంగా ఈనెల 20వ తేది నాటికి ఉధృతమై అత్యంత భారీస్థాయిలో 5,65,250 క్యూసెక్కుల నీటి ప్రవాహం రావడం సోమశిల డ్యామ్ చరిత్రలోనే ఇదే ప్రథమం. దీంతోపాటు భారీవర్షాలు కూడా తోడుకావడంతో పెన్నా నదీ పరీవాహక ప్రాంతాలను వరదప్రవాహాలు ముంచెత్తాయి. జిల్లావ్యాప్తంగా చెరువులన్నీ నిండిపోయాయి. కొన్ని పొంగిపోతున్నాయి. అనేకగ్రామాల్లో ఎక్కడ చూసినా నీళ్ళే. ఊళ్ళంతా నీళ్ళు రావడం, ఇళ్ళన్నీ నీట మునగడంతో వేలాదిమంది ప్రజలు కట్టుబట్టలతో పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. పెన్నా పరీవాహక ప్రాంతాలైన కోవూరు నియోజకవర్గంలోని అనేక గ్రామాలు వరదనీటిలో చిక్కుకున్నాయి. పడుగుపాడు వద్ద రైల్వేలైను వరదప్రవాహానికి దెబ్బతినింది. రైలు పట్టాలు దెబ్బతినడంతో రైళ్ళ రాకపోకలు నిలిపేసి వెంటనే మరమ్మతులు చేపట్టారు. రోడ్లు చాలాచోట్ల దెబ్బతినడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా కూడా అనేక గ్రామాల్లో నిలిచిపోయింది. సోమశిల డ్యామ్ సమీపంలోనే ఉన్న చరిత్రాత్మకమైన దేవాలయం సోమేశ్వరాలయం వరద తాకిడికి పూర్తిగా ధ్వంసమైంది. నెల్లూరు నగరంలోని అనేక లోతట్టుప్రాంతాలు వరదనీటిలో చిక్కుకుపోయి ప్రజలు ఎన్నో బాధలు పడ్డారు. ఒక్క నెల్లూరు నగరంలోనే సుమారు 50 వేల మందికి పైగానే ప్రజలు నిరాశ్రయులై పునరావాసకేంద్రాలకు తరలివెళ్లారంటే పరిస్థితి ఎంత కష్టంగా తయారైందో అర్ధమవుతుంది. వరదల దెబ్బకు ఎవరి బాధలు వారివిగానే మారాయి. ఇళ్ళు నీళ్లల్లో మునిగిపోవడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు, నిరుపేదలు కుటుంబాలతో సహా ఎన్ని కష్టాలు పడ్డారో చెప్పలేం. అయితే ప్రభుత్వం జిల్లా అధికారయంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు స్పందించి బాధిత ప్రాంతాల్లో తగు సహాయచర్యలు చేపట్టారు. అప్పుడప్పుడు జల్లులు కురుస్తూనే ఉన్నా మొత్తమ్మీద ఈనెల 23వ తేది నాటికి వానలు కొద్దిగా ఉపశమించాయి. ఎట్టకేలకు ఈనెల 24వ తేదికి సోమశిల డ్యామ్‌కు వరదనీటి ఉధృతి కొంత తగ్గింది. జలాశయం పూర్తిస్థాయి సామర్ధ్యంతో 71 టిఎంసిల నీటి నిల్వతో ఇప్పుడు నిండుకుండలా ఉంది.



## చెక్కుచెదరని సోమశిల డ్యామ్

వానలు వరదలు వచ్చినప్పుడల్లా సోమశిల డ్యామ్ ప్రమాదంలో పడిపోయిందంటూ లేనిపోని పుకార్లు వస్తుండడం దురదృష్టకరం. ఈ డ్యామ్‌కు ఇలాంటి ఉపద్రవాల వల్ల ఎప్పుడూ ఎలాంటి ప్రమాదం ఉండదు. అత్యంత పటిష్టవంతమైన నిర్మాణంగా పేరెన్నికగన్న డ్యామ్ ఇది. ఆసియా ఖండంలోనే ఇది అత్యంత పెద్దదైన, అత్యద్భుతమైన మట్టికట్టడం. ప్రపంచ ప్రఖ్యాతిచెందిన ఇంజనీర్ కెఎల్‌రావు సారధ్యంలో ఈ డ్యామ్ నిర్మాణానికి రూపకల్పన జరిగింది. 1975లో ఈ డ్యామ్‌కు శంకుస్థాపన జరిగింది. జిల్లా రైతాంగానికి ప్రాణప్రదమైన ఈ డ్యామ్ నిర్మాణం చేయడం ద్వారా జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు తాగునీటిని కూడా కొరతలేకుండా అందిస్తోంది. 352 మీటర్ల పొడవు, 200 మీటర్ల వెడల్పుతో, 78 టిఎంసిల నీటి సామర్ధ్యంతో ఈ డ్యామ్‌ను నిర్మించారు. 260 మీటర్ల వెడల్పుతో కాంక్రీట్ కట్టడాన్ని 12 గేట్ల ద్వారా 6.95 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల సామర్ధ్యంతో ఈ జలాశయాన్ని నిర్మాణం గావించారు. ఎంతో ముందు చూపుతో డ్యామ్ పటిష్టతకు ఎలాంటి ఢోకా లేకుండా ఈ మట్టికట్టకు అత్యంత పటిష్టవంతంగా కాంక్రీట్ డయాఫ్రంలు ఏర్పాటు చేశారు. నాటి ఇంజనీర్ల ప్రతిభా పాటవాలకు సోమశిల జలాశయం చక్కని నిదర్శనం. ఈ డ్యామ్ కట్టిన తర్వాత ఎప్పుడూ లేనంతగా మొన్నటివరదల్లో 5.50 లక్షల క్యూసెక్కుల భారీ నీటిప్రవాహం వచ్చినా డ్యామ్ ఏమాత్రం తొణకలేదు.. బెణకలేదు. ఎంత ప్రవాహం వచ్చినా, ప్రవాహాన్ని వదిలినా ఈ డ్యామ్‌కు సంబంధించి ఎక్కడా ఒక్క చిన్న లోపం కూడా జరగలేదు. సోమశిల డ్యామ్ పటిష్టతకు ఇంతకంటే నిదర్శనం ఇంకేం కావాలి?!...

## వరద నష్టం.. 535 కోట్లకు పైగానే...

జిల్లాను ముంచెత్తిన ఈ వానలు, వరదల వల్ల వివిధ రంగాలకు సంబంధించి కనీసం 535 కోట్ల రూపాయలకు పైగానే నష్టం జరిగినట్లు జిల్లా ఉన్నతాధికారుల ప్రాథమిక అంచనా. సుమారు 14వేల హెక్టార్లలో వరిపంట, నారుమళ్లు దెబ్బతిన్నాయని భావిస్తున్నారు. కానీ ఈ నష్టాలు మరింత భారీగానే ఉండవచ్చు కూడా. లెక్కకు అందిన కష్టం, నష్టం ఎంత ఉంటుందో చెప్పలేం. పూర్తిస్థాయి అంచనాలు వస్తే తప్ప నష్టాలెంతగా జరిగాయో నిర్ధారించలేం.



ఉధృతంగా పెన్నా ప్రవాహం

## 27 నుంచి మళ్ళీ..వాన గండమా?...

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం దక్షిణాంధ్ర వైపు కదులుతోందని, దీని ప్రభావంతో ఈనెల 27 నుంచి మళ్ళీ నెల్లూరుజిల్లాకు వానలు ముంచుకొచ్చే అవకాశం ఉందని వాతావరణశాఖ ముందస్తు హెచ్చరిక చేస్తోంది. అయితే, ఇప్పటికే వానలు, వరదలతో కుదేలైపోయిన జిల్లా..మళ్ళీ వానలు విరుచుకుపడితే పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### వరదలో చిక్కుకున్నవారిని కాపాడుతూ..

## కానిస్టేబుల్ కన్నుమూత

- జిల్లా ఎస్పీ విజయారావు నివాళి



బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామరమడుగు గ్రామంలో వరద నీటిలో చిక్కుకున్నవారిని కాపాడుతున్న విజయనగరానికి చెందిన 5వ బెటాలియన్‌కు చెందిన ఎన్డీఎఫ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు వరద తాకిడికి లైఫ్‌జాకెట్ ఊడిపోవడంతో ప్రవాహవేగానికి నీళ్లలో పడి కొట్టుకుపోయి మృతిచెందారు. ఈనెల 20న ఈ విషాదం చోటు చేసుకుంది. విధినిర్వహణలో ఉండి అందరినీ ప్రమాదం నుంచి కాపాడుతున్న కానిస్టేబుల్ మరణం పోలీసువర్గాలను ఆవేదనకు గురిచేసింది. ఈ సమాచారం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ విజయారావు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

**వరదనీటిలో కొట్టుకుపోయి రైతు మృతి :**

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన బుజ్జయ్య అనే రైతు ఈనెల 20న వరదనీటిలో ప్రమాదవశాత్తూ చిక్కుకుపోయి మృతిచెందాడు. ఆయన మరణంతో గ్రామంలో విషాదం అలముకుంది.

## పెన్నానది ప్రవాహంలో పడిపోయిన పూజారి

### ప్రాణాలకు తెగించి కాపాడిన సిఐ రాములనాయక్



పెన్నానది వరద నీటి ప్రవాహంలో ప్రమాదవశాత్తూ పడిపోయిన ఓ పూజారిని ఆ ప్రాంతంలో విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ సిఐ రాములనాయక్ ప్రాణాలకు తెగించి కాపాడి అందరి ప్రశంసలు అందుకున్నారు. కొడవలూరు మండలంలోని శివాలయం అర్చకుడు మల్లికార్జునరావు ఈనెల 20వ తేది రాత్రి నగరంలోని పెన్నా బ్రిడ్జి వద్ద ద్విచక్రవాహనంలో వస్తుండగా వాహనం అదుపుతప్పడంతో వరద ఉధృతికి వాహనంతో పాటు నీళ్ళలో కొట్టుకుపోయాడు. మధ్యలో ఓ చెట్టును పట్టుకుని బిక్కుబిక్కుమంటూ ప్రాణభయంతో వేలాడుతుండగా గమనించిన సిఐ రాములనాయక్ రోప్ సాయంతో ప్రవాహంలోకి దిగి ఎంతో శ్రమించి మల్లికార్జునరావును ఒడ్డుకు చేర్చాడు. దీంతో ప్రాణాపాయం నుంచి గట్టెక్కిన బాధితుడు సిఐకి కన్నీళ్ళతో తన కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావుతో పాటు పలువురు పోలీసు అధికారులు సిఐని అభినందించారు.

**జీవితాంతం మీ త్యాగాన్ని స్మరించుకుంటాం - బ్రాహ్మణ సంఘం**

జీవితాంతం మీ త్యాగాన్ని స్మరించుకుంటామని, మా పూజారిని కాపాడినందుకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామని, ఇలాగే మీరు అందరి మన్ననలు పొందుతూ ఎల్లవేళలా బాగుండాలని నెల్లూరు బ్రాహ్మణ సంఘం వారు సి.ఐ రాములు నాయక్‌ను ఇటీవల జిల్లా ఎస్పీ సమక్షంలో సన్మానించి అభినందించారు.

## బాధితులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి


**- సిపిఎం నాయకులు**

జిల్లావ్యాప్తంగా వరదపీడిత ప్రాంతాల్లోని బాధితులను, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు మూలం రమేష్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు చంద్ర రాజగోపాల్, గోగుల శ్రీనివాసులు కోరారు. ఈనెల 20న వారు జిల్లాలోని పెనుబల్లి, దామరమడుగు, అన్నారెడ్డి పాళెం, వీర్లగుడిపాడు, అప్పారావుపాళెం, ఆత్మకూరు, కోటితీర్థం, ఉదవలపల్లి, సూరాయపాళెం తదితర గ్రామాల్లో పర్యటించి వరదబాధితుల స్థితిగతులను తెలుసుకున్నారు. ఇళ్ళు పూర్తిగా దెబ్బతిన్నవారికి 50వేలు, పాక్షికంగా నష్టపోయినవారికి 25వేల పరిహారంగా ఇవ్వాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వరద తాకిడి వల్ల నష్టపోయిన పంటల రైతాంగాన్ని కూడా ఆదుకోవాలని, నెల్లూరు నగరంలోని ముంపు బాధితులకు పునరావాసం కల్పించి చేయూతనందించాలని వారు కోరారు.

# నిరాశ్రయులకు అండగా రెడ్‌క్రాస్



వరదలకు దెబ్బతిని అల్లాడుతున్న వందలాది బాధిత కుటుంబాల వారికి నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ తనవంతు చేయూతనందిస్తోంది. పెన్నానదీ తీరంలో సర్వస్వం కోల్పోయి రోడ్డున పడిన బాధితులకు సాయం అందించి వారిని ఆదుకుంటోంది. ఈనెల 24న కోడూరు మండలంలోని సాలుచింతల గ్రామం పరిసరాల్లో ఉన్న సుమారు వంద కుటుంబాల వారికి తాత్కాలికంగా టెంట్లు వేసుకునేందుకు టార్పాలిన్ పట్టలతో పాటు దోమతెరలు, బాధితులందరికీ 10కేజీల బియ్యం, పప్పులు, ఆయిల్ ప్యాకెట్, సబ్బులుతో పాటు 18రకాల స్టీల్ వంటపాత్రల సెట్టు, అల్యూమినియం వంటపాత్రలు, ప్లాస్టిక్ బకెట్లు వగైరాలను అందజేసి ఆదుకున్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కోవూరు పరిసర ప్రాంతాల్లో వరద దెబ్బకు వందలాది ఇళ్ళు కొట్టుకుపోయాయని, బాధితులకు తమ వంతు సేవలందిస్తున్నామని, గోమతి నగర్‌లో 500 మందికి రెడ్‌క్రాస్ తరపున పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేసి బాధితులను ఆదుకుంటామని, నెల్లూరు రైల్వే స్టేషన్‌లో ఆగిపోయిన రైళ్ళలో ఉన్న ప్రయాణీకులకు భోజనాలు ఏర్పాటుచేయడంతో పాటు, కోవూరు ప్రాంతంలో గత మూడు రోజులుగా 15వేల వాటర్‌ప్యాకెట్లకు పైగానే బాధితులకు పంపిణీచేశామన్నారు. రెడ్‌క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com